ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కర్ణాటక వార్తలు

మంగళవారం 17 జూన్ 2025





మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

మోదీ పాలనలోనే ఆర్థిక పురోగతి

● కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

రాయచూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): దేశంలో గడచిన పదేళ్లలో జరిగిన ఆర్థిక పురోగతి ఒక అద్భుతమని కేంద్ర ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. నరేంద్ర మోదీ సమర్థ పాలనతోనే ఇది సాధ్యపడిందన్నారు. సోమవారం నగరంలో కేంద్ర మంత్రి విలేకరులతో మాట్లాడారు. 11 ఏళ్ల మోదీ పాలన విజయాలపై తమ పార్టీ, ప్రభుత్వం చేపట్టిన ప్రచారం నూటికి నూరు శాతం వాస్తవికతను ప్రతిబింబించేవిగా ఉందన్నారు. యూపీఏ పాలన కాలంలో ప్రపంచ ఆర్థిక రంగంలో దేశం 11వ స్థానంలో ఉండగా ప్రస్తుతం నాల్గవ స్థానంలో ఉన్న విషయాన్ని ఎవరూ కాదనలేదన్నారు. నరేంద్ర మోదీ పాలనకు సున్నా మార్కులు వేస్తానంటూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వానికే దేశ ప్రజలు జీరో స్థానం కల్పించిన విషయాన్ని ఆయన గుర్తించాలని ఎద్దేవా చేశారు. కాగా ధరల పెరుగుదలకు ఉన్న కారణాలు కాంగ్రెస్ పార్టీకి తెలుసని, బంగారం ధర పెరుగుదలపై ఆ పార్టీకి సమాచారం ఉన్నా ప్రజలను తప్పుదోవ పట్టించేదిగా కేంద్రంపై విమర్శలు చేస్తుండడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల అమలు కోసం ప్రభుత్వం 48 రకాల వస్తువులపై ధరలు పెంచిందని పెట్రోల్, డీజిల్ ధరల పెంపు కూడా కాంగ్రెస్ వైఫల్యమే కారణమని కేంద్ర మంత్రి ఆరోపించారు. గడచిన 10 ఏళ్ల కాలంలో దేశంలో 26 కోట్ల మంది ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారు ఆర్థికంగా బలోపేతమైన విషయాన్ని ప్రపంచ ఆర్థిక సర్వేనే వెల్లడించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని ధ్వజమెత్తారు.

అయిన వారికే.. అందలం..!



● ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆప్తులదే హవా

● కావాల్సినవారికే కాంట్రాక్టులు

● తెరచాటున అంతా ఫిక్స్

బెంగళూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వంలో ఇటీవల కీలకమైన హోదాలలో కొనసాగుతున్న వారి ఆప్తుల హవా పెరిగింది. అంతావారే మేనేజ్ చేసేస్తున్నారు. వారి ప్రభావంతో పాలనా విభాగామే తలపట్టుకునే పరిస్థితి ఏర్పడింది. ఏళ్ల తరబడి నిర్దిష్టమైన విభాగాలలో కొనసాగేవారు హైరానా పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ నిత్యకార్యకలాపాలు విడిచి ప్రత్యేక సమయంలో కార్యక్రమాల ఏర్పాటు, ప్రచారం, వివిధ సేవలు, అభివృద్ధి పనులు, మరమ్మతులకు సంబంధించిన పనులలో వీరి జోక్యం పెరుగున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, చీఫ్ సెక్రటరీతోపాటు ఉన్నతస్థాయి అధికారులలో కొందరు తమ కుటుంబ సభ్యులు, ఆప్తులకు ప్రభుత్వ పనులను ఎటువంటి అడ్డంకులు లేకుండా కేటాయిస్తున్నారు. ఇది అడ్డదారి అయినా సజావుగా పనులు అనుకున్న సమయానికి సక్రమంగా జరుగుతున్నాయని వదిలేస్తున్నారు. తమవారికి పనులు అప్పగించే విషయంలో ఎటువంటి బేషజాలు లేకుండా వ్యవహరిస్తున్నారు. కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగాలు నియమించే విషయంలోనూ కీలక అధికారుల ఆప్తులదే హవా సాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఆప్తులకే పనుల కేటాయింపు

ప్రభుత్వ కార్యక్రమాలు నిర్ణయించినవెంటనే తెరవెనుక ఫిక్సింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. కార్యక్రమానికి ఒక స్పష్టమైన రూపం వచ్చేసరికి అది ఎవరికి కేటాయించాలనేది కూడా తెలిసిపోతుంది. అధికారి లేదా మంత్రి ఆప్తులకు వర్క్ ఆర్డర్ లభిస్తుంది. షార్ట్ టెండర్లను ఆహ్వానించడం లేదా డమ్మీ ప్రస్తావనలు పంపడం, ఎవరో ఒకరికి పనులు కేటాయించి వారి ద్వారానే కార్యాచరణ జరుపుతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల బంధువులు, అధికారుల పిల్లలు వారి బంధువుల పేరిట కంపెనీలు సృష్టించి వాటికే పనులు లభించేలా ప్రక్రియ సాగుతోంది. మరోవైపు పనులు పొందే కీలక సంస్థలు నిర్వహించకుండా సబ్ కాంట్రాక్టు ద్వారా అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. విధానసౌధలోనే మకాం వేసే కొందరు ఇటువంటి ప్రక్రియలు నిరంతరంగా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.


● అభివృద్ధి పనులు లేదా సేవల విషయంలో ఫిక్సింగ్ జరిగిపోవడంతో పోటీ లేకుండా చేస్తున్నారు. తద్వారా వీరు నిర్ణయించిందే ధరగా మారిపోయింది. ప్రాబల్యాన్ని ఉపయోగించి అవకాశాలు పొందేవారు సిబ్బంది నియమించడం లేదా ఇతరత్రా పనులలో తప్పులు ఉన్నా అధికారులు అంగీకరించే పరిస్థితి కొనసాగుతోంది. పారదర్శకత లేకుండా ఒక పనికి లేదా కాంట్రాక్టు ఉద్యోగుల నియామకం విషయంలో బహిరంగంగా టెండర్లు వేస్తే ఎక్కువమంది పోటీ పడే అవకాశం ఉంటుంది. ఇక్కడంతా ఈ పని నీది, ఆ పని నాది... అని పంచుకునేలా ఒప్పందాలు చేసుకోవడంతో అవినీతిని పరోక్షంగా ప్రోత్సహించినట్టు అవుతోంది. అడ్డదారి వ్యవహారాలతో గుణాత్మకమైన సేవలు సాధ్యం కావడం లేదు. తద్వారా పాలనాయంత్రాంగానికి సమస్య ఏర్పడుతోంది.

బినామీ సంస్థకే ప్రచార సేవలు

పాలనా యంత్రాంగంలో కీలకమైన హోదా ప్రధాన కార్యదర్శి స్థాయి అధికారి ఒకరు మూడు ప్రైవేట్ కంపెనీలను బినామీ రూపంలో కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ప్రచార సేవలు ఆ సంస్థకే దక్కుతున్నాయి. ఇక ప్రభుత్వ హాస్టళ్లకు వివిధ రకాల పరికరాలు సమకూర్చే విషయంలో ఓ కీలక మంత్రి సోదరుడికి చెందిన కంపెనీదే హవా అనే ఆరోపణలు ఉన్నాయి.

పలుకుబడే కీలకం...

శాసనవ్యవస్థలో కీలకహోదాలో ఉండే అధికారి సమీప బంధువుకు విధానసౌధలోని ప్రముఖ సేవలు సమకూరుస్తున్నట్టు తెలుస్తోంది. ఇక్కడ వృత్తి పరమైన సీనియారిటీ, పోటీ లేకున్నా పలుకుబడి కీలకమవుతోంది. మహిళా ఐఏఎస్ అధికారి పిల్లలతోపాటు కుటుంబ సభ్యులు, బంధువులు కలిపి ఐదుగురు డైరెక్టర్లతో ఓ కంపెనీ పనిచేస్తోంది. ఆ కంపెనీకి ప్రభుత్వంలో ఎటువంటి పనులు పొందడమైనా సులభంగా మారిపోయింది. కార్యదర్శి స్థాయి అధికారి ఒకరు తమ వియ్యంకుడికి కాంట్రాక్టర్‌ను చేసి పనులు కేటాయించినట్టు విధానసౌధలో చర్చనీయాంశమైంది. పలుకుబడి కల్గిన వారి ఆప్తులలో కొందరు డైరెక్టర్‌లుగా పలు కంపెనీలను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ సొమ్మును సులభతరంగా అయినవారికి ఆప్తులకు మళ్లించే ప్రక్రియ కీలకుల కనుసైగలలోనే కొనసాగుతోంది. విధానసౌధలో జరిగే భారీ కార్యక్రమాలు గతంలో రాష్ట్ర రాజకీయాలలో కీలకమైన హోదాలో కొనసాగిన అగ్రనేత వారసులకే కొన్నేళ్లుగా దక్కుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



విద్యాభివృద్ధికి ప్రాధాన్యం

● విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప



మాట్లాడుతున్న మధుబంగారప్ప

బళారి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కళ్యాణ కర్ణాటక విద్యాపరంగా వెనుకబడినప మాట వాస్తవమే. రాబోయే సంవత్సరాల్లో విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప అన్నారు. ఆయన సోమవారం నగరంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది అక్షర అవిష్కార్ యోజన ద్వారా కళ్యాణ కర్ణాటక కొద్దిగా మెరుగుపడిందని అన్నారు. గతేడాది పాఠశాలల ప్రాథమిక సౌకర్యాలపై ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ప్రస్తుతం అభ్యాసనంపై దృష్టిసారించామన్నారు. పరీక్షలను వెబ్‌కాస్ట్ చేయడం ద్వారా దాని పవిత్రతను కాపాడామని అన్నారు. మొదటి పరీక్షలో విఫలమైన 84వేల మంది పిల్లలు రెండవ పరీక్షలో ఉత్తీర్ణులయ్యాని అన్నారు. ఈ సంవత్సరం పది ఫలితాలు గతంతో పోలిస్తే 8.5శాతం మెరుగుపడిందన్నారు. గ్రేస్ మార్కులు ఇవ్వడం ద్వారా, ఉచిత విద్యుత్ కనెక్షన్ ద్వారా పాఠశాలలు సాయంత్రం చదువుకోవడానికి వీలు కల్పించామని అన్నారు. పాఠశాలల్లో పిల్లల నమోదును ముఖ హాజరు ద్వారా పొందే విధానాన్ని ఈ సంవత్సరం అమలు చేస్తామని అన్నారు.

ఉపాధ్యాయుల నియామకం

నాగమోహన్ దాస్ కమిటీ నివేదిక తర్వాత 13వేల మంది ఉపాధ్యాయులను నియమిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకాన్ని అమోదిస్తానని ఆయన అన్నారు. పిల్లల్లో నైతిక విద్య లేకపోవడంతో ఈ సంవత్సరం నుంచి వారానికి రెండురోజులు నీతి పాఠాల్ని బోధిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది 700లకు పైగా పాఠశాలలకు గదులు నిర్మిస్తున్నామన్నారు. మంచి ఫలితాలు ఇస్తున్న ద్విభాషా విద్య ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను నాలుగు వేలు పెంచుతున్నట్లు ఆయన తెలిపారు. 1995 నుంచి కన్నడ మీడియం పాఠశాలలను ఎయిడెడ్ పాఠశాలలుగా మార్చలేదన్నారు. ఈ ఏడాది వాటిని ఎయిడెడ్ పాఠశాలలుగా మార్చేందుకు ముఖ్యమంత్రితో చర్చిస్తానన్నారు. అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ద్వారా శిక్షణ పొందిన ఉపాధ్యాయులు మంచి బోధన అందిస్తారని గ్రహించి ఈ సంవత్సరం రాష్ట్రంలో 50వేల మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని సంస్థను అభ్యర్థించానన్నారు. కార్యక్రమంలో శాసనమండలి స్పీకర్ బసవరాజ్ హొరట్టి, డీసీసీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, బసవరాజేశ్వరి ఎడ్యుకేషన్ గ్రూప్ అధ్యక్షుడు డాక్టర్ మహిపాల్, కురుగోడు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

● మంత్రి దినేశ్‌గుండూరావు



రక్తపరీక్ష చేయించుకుంటున్న మంత్రి దినేశ్ గుండూరావు

బెంగళూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రక్తదానంతో మరొకరికి ప్రాణదానం చేయవచ్చని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్‌గుండూరావు అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శేషాద్రిపురం కళాశాలలో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ రక్తదానంతో ఆరోగ్యం మెరుగు అవుతుందన్నారు. ఆరోగ్యంగా ఉండే వారంతా మూడు నాలుగు నెలలకోసారి రక్తదానం చేయవచ్చునన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైనప్పుడు స్వచ్ఛందంగా ఇవ్వాలని సూచించారు. సమాజంలో రక్తం కొరతతో ప్రాణాలు పోయే పరిస్థితి రాకూడదన్నారు. బ్లడ్‌బ్యాంకు, ఎయిడ్స్ నియంత్రణ విభాగం, రెడ్‌క్రాస్, స్వామి వివేకానంద, రోటరీ సహా పలు సంస్థలు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాయని కొనియాడారు.



దావణగెరెలో లబ్ధిదారులకు సంక్షేమాలు అందజేస్తున్న సీఎం సిద్ధరామయ్య

నావి అబద్ధాలైతే.. వేదికలపై మాట్లాడను..!

● దావణగెరెలో సీఎం సిద్ధరామయ్య సవాల్

బెంగళూరు, జూన్16(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి విషయంలో కేంద్రం మాకు ద్రోహం చేసిందనే విషయంలో నేను అబద్ధాలు చెప్పినట్టు నిరూపిస్తే ఇకపై వేదికలపై ప్రసంగాలు చేసేది లేదని సీఎం సిద్ధరామయ్య సవాల్ విసిరారు. దావణగెరె జిల్లాలో సోమవారం రూ.1350 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వివిధ పథకాల లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అభివృద్ధి, సంక్షేమంలో కులమతాలు, పార్టీలు చూడమన్నారు. అన్ని పార్టీలవారు మా గ్యారెంటీల లబ్ధిదారులన్నారు. 15వ ఫైనాన్స్ కమిషన్ ద్వారా రూ.11,500 కోట్లు రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, భద్ర ఎగువ ప్రాజెక్టుకు కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన 5వేల కోట్లు ఇవ్వలేదని, ఇదే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన ద్రోహమన్నారు. ప్రతిపక్షనేత అశోక్, బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర బహిరంగచర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. 56 అంగుళాల ఛాతీ కల్గిన ప్రధాని మోదీ విఫలమయ్యారన్నారు. ఛాతీ ఎన్ని అంగుళాలు ఉంటే మాత్రం పేదలు, మధ్య తరగతి ప్రజలపట్ల అభిమానం, మానవత్వం ఉండాలన్నారు. రాష్ట్రఖజానాలో నిధులు లేవనే బీజేపీకి అభివృద్ధి కనిపించడం లేదన్నారు. ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నామన్నారు. గ్యారెంటీలు అమలు కావని ఎన్నోసార్లు చెప్పారన్నారు. దేశంలో ఎవరికంటికైనా మంచి రోజులు కనిపించాయా..? అంటూ ఎద్దేవా చేశారు. బీజేపీ అబద్ధాలకు రాష్ట్ర ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. ఉప ఎన్నికల్లో శిగ్గావి, చన్నపట్టణలో మాజీ సీఎంల కుమారులే ఓడారని, సండూరులో మేమే గెలిచామన్నారు.

శ్యామనూరు కోరితే వచ్చే ఎన్నికల్లోనూ టిక్కెట్

శ్యామనూరు శివశంకరప్ప 95వ జన్మదినం జరుపుకోవడం సంతోషంగా ఉందని, ఆయన కోరితే వచ్చే ఎన్నికల్లోనూ టిక్కెట్ ఇస్తామని సీఎం ప్రకటించారు. శ్యామనూరు శివశంకరప్ప బర్త్‌డే కేక్ కట్ చేశారు. ఇదే సందర్భంగా కులాంతర వివాహాలను జరిపించారు. డీసీఎం డీకే శివశకుమార్, హోం మంత్రి పరమేశ్వర్, శ్యామనూరు కుమారుడు, ఉద్యానవన శాఖ మంత్రి మల్లికార్జున, కోడలు ప్రభా మల్లికార్జునతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఉమ్మడి కుటుంబాల విచ్ఛిన్నం..
సమాజంపై పెనుప్రభావం

● ఆచార్య తంబిశెట్టి రామకృష్ణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

బెంగళూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమవుతుండడం సమాజంపై పెను ప్రభావం చూపుతోందని ప్రముఖ రచయిత, కేరళ రాష్ట్ర కాలికట్ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ తంబిశెట్టి రామకృష్ణ అన్నారు. ప్రొఫెసర్, రచయిత్రి డాక్టర్ యర్రాప్రగడ కస్తూరిబాయి రచించిన 'జీవితమా నీవేమిటి' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమం నగరంలోని విజయనగర్ తేరాపంత్ భవనంలో నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ మొబైల్ ఫోన్ యువతను, కుటుంబ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందన్నారు. తెలుగు మాట, పాట, ఎంతో శక్తిమంతమైనవని, ఇటీవల రెండు దశాబ్దాలలో వాటిపైనా ప్రభావం చూపిందన్నారు. మా తెలుగు తల్లి సంస్థాపక అధ్యక్షుడు కొమర్రాజు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తమ సంస్థ ఆన్‌లైన్‌లో తెలుగు తరగతులను నిర్వహిస్తోందన్నారు. కవులు, కళాకారులకు గతంలో మాదిరిగా ఆదరణ లభించడం లేదన్నారు. రచయిత్రి కస్తూరాబాయి మాట్లాడుతూ నా జీవిత అనుభవంతో 'జీవితమా నీవేమిటి?' అనే కవితా సంపుటిని రచించానన్నారు. తెలుగు భాషా సంస్కృతులపై అపారమైన అభిమానంతోనే కవితా సంపుటి రచనకు కారణమైందన్నారు. పలు కవితలను ఆమె సభికులకు చదివి వినిపించారు. బెంగళూరు యూనివర్సిటీ తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఆశాజ్యోతి మాట్లాడుతూ 11వ శతాబ్దంలోనే కులమతాలకు అతీతంగా సమాజాన్ని ఒక గొడుగుకిందకు తీసుకురావాలనే బసవణ్ణ వచనం మనందరికీ స్ఫూర్తిదాయకం కావాలన్నారు. అనుభవం, అనుభూతులనుంచి పుట్టేదే నిజమైన కవిత్వమన్నారు. సెయింట్ ఫిలోమినా గ్రూప్ విద్యాసంస్థల కార్యదర్శి వెంకటపతి చంద్రయ్యనాయుడు, గద్వాల విశ్వకిరణ్ ప్రసంగించారు. విదూషి విజయశ్రీ, ప్రియాల నృత్యరూపకం ప్రేక్షకులను ఆకట్టుకుంది.

కోలారులో ఏటీఎం చోరీ

● రూ.27 లక్షలు దోచిన ముఠా

బెంగళూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏటీఎం చోరీలు తీవ్రమవుతున్నాయి. కోలారు నగరం గల్‌పేట పోలీస్‌స్టేషన్ సమీపంలో సహకారనగర్ ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ జరిగింది. సోమవారం ఉదయం చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. రూ.27 లక్షలు ముఠా దోచినట్టు బ్యాంకు అధికారులు తెలిపారు. కోలారు ఎస్పీ నిఖిల్ ఏటీఎంను పరిశీలించారు. క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్ ఆధారాలు సేకరించాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.



చోరీకి గురైన ఏటీఎం ఇదే...

బైక్‌ను ఢీకొన్న లారీ

● ఇద్దరు డ్యాన్సర్ల దుర్మరణం

బెంగళూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నెలమంగల సమీపం కుణిగల్ బైపాస్‌పై బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువ డ్యాన్సర్లు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఆదివారం ఘటన చోటు చేసుకుంది. శ్రీరాంపుర నివాసి ప్రజ్వల్ (22), కురుబరహళ్ళి నివాసి సహన (21) మృతి చెందినవారుగా గుర్తించారు. ప్రజ్వల్, సహనలు వృత్తిపరంగా డ్యాన్సులు చేస్తుంటారు. కుణిగల్‌లో ఓ ఈవెంట్‌కు సంబంధించి నగదు తీసుకొచ్చేందుకు బెంగళూరు నుంచి వెళ్లి తిరిగి వస్తుండగా వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొట్టింది. లారీ డ్రైవర్‌ను నెలమంగల ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లారీని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు. లారీ వేగంగా నడపడమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా గుర్తించిన పోలీసులు అందుకు అనుగుణంగా కేసు నమోదు చేశారు.



ప్రజ్వల్, సహన (ఫైల్)

కాంట్రాక్టర్ల రింగ్..!

బియ్యం వేలంలో 33 శాతం లెస్‌కు

దక్కించుకున్న వ్యాపారి

ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

జిల్లాధికారి నిర్ణయంపై సర్వత్రా చర్చ

8

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయండి

8

5వ ఆర్థిక సంఘం చైర్మన్ నారాయణస్వామి



నాయకత్వ మార్పు హైకమాండ్ నిర్ణయం

● మంత్రి సతీశ్ జార్కిహొళి స్పష్టీకరణ

● తమ స్థానం మిగిలితే చాలని వ్యాఖ్య

రాయచూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడి మార్పు హైకమాండ్ నిర్ణయమే తప్పా మరెవ్వరో చర్చించడం సాధ్యం కాదని రాష్ట్ర ప్రజాపనుల శాఖ మంత్రి సతీశ్ జార్కిహొళి స్పష్టం చేశారు. అదే సమయంలో తమ స్థానాలు మిగిల్తే చాలంటూ మంత్రి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జిల్లా పర్యటనకు సోమవారం వచ్చిన మంత్రి ప్రగతి పరిశీలన సభ అనంతరం విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడి మార్పు జరుగుతుందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేనే రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరిస్తారంటూ మాజీ మంత్రి హెచ్ విశ్వనాథ్ చేసిన వ్యాఖ్యలను మంత్రి కొట్టిపారేశారు. తమ పార్టీ వ్యవహారాల గురించి ఆయన ఎలా మాట్లాడతారని ఎదురు ప్రశ్నించారు. కులగణనకు సంబంధించి పునఃసమీక్ష నిర్వహించేందుకు ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. కొన్ని సామాజిక వర్గాల నుంచే అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం పునఃసమీక్షకు సిద్ధంగా ఉందన్నారు. కులగణనకు సంబంధించి గతంలో రూ.160 కోట్లు ఖర్చయ్యాయని 7 కోట్ల కన్నడ ప్రజల అభిప్రాయాలను గౌరవించడం ప్రభుత్వం బాధ్యత అన్నారు. జూరాల బ్యాక్ వాటర్ వల్ల ముంపునకు గురయ్యే ప్రాంతాలకు సంబంధించి మూడు వంతెనల నిర్మాణాలను త్వరలోనే అధికారులతో సమీక్షించి తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో చేపట్టిన 50 జాతీయ రహదారుల నిర్మాణాల్లో 30 పూర్తయ్యాయని, మిగిలిన 20 చోట్ల పనులు పురోగతిలో ఉన్నాయని మంత్రి వివరించారు. రాయచూరు నగరంలో రింగ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి తమ శాఖ పరిశీలనలో ఉందని, దీనిపై త్వరలోనే శాఖాపరమైన అధికారులతో సమావేశం నిర్వహించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు.



మాట్లాడుతున్న మంత్రి జార్కిహొళి

హత్య కేసులో దంపతుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యబాబు

పుట్లూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 14న జరిగిన నడిపి కంబగిరి హత్యకేసులో సోమవారం దంపతులు గుర్రమ్మ, పెద్దకంబగిరిలను అరెస్ట్‌చేసినట్లు పుట్లూరు సీఐ సత్యబాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పెద్దకంబగిరి, నడిపి కంబగిరి తరచూ ఆస్తి తగాదాల్లో భాగంగా ఇంటికోసం గొడవపడేవారన్నారు. దీంతో గత శుక్రవారం రాత్రి మరోమారు గొడవపడ్డారని తెలిపారు. పెద్దకంబగిరి కత్తి తీసుకొని నిద్రిస్తున్న నడిపి కంబగిరిని హత్య చేశాడన్నారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేయగా ఆస్తి కోసమే చంపినట్లు ఒప్పుకున్నాడని అన్నారు. దీంతో భార్యభర్తలను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

ధర్మవరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం ఉదయం ధర్మవరం పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీ వద్ద చోటుచేసుకుంది. హిందూపురం రైల్వే హెడ్ కానిస్టేబుళ్లు ఎర్రిస్వామి, వెంకటరామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన గుండుగోపాల్ (57) తాగుడుకు బానిసై అనునిత్యం కుటుంబ సభ్యులను వేధించేవాడు. మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వకపోవడంతో కుటుంబ సభ్యులతో గొడవకు దిగాడు. దీంతో క్షణికావేశంతో రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు ఘటనా పరిశీలించారు. భార్య ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..

కూడేరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇప్పేరు గ్రామానికి చెందిన మహేష్ (23) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. మహేష్ అనే యువకుడు గత కొంత కాలంగా గ్రామంలోని నల్లలమ్మ దేవతకు పూజలు చేస్తూ కుటుంబ పోషణకు ఆసరాగా ఉండేవాడు. కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపం చెంది ఆదివారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. రాత్రి పదకొండున్నర గంటల సమయంలో కుటుంబ సభ్యులు గమనించి శవాన్ని కిందికి దించారు. మృతుడి తండ్రి రామన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రామానాయుడు తెలిపారు.

కొరివిపల్లిలో గుర్తుతెలియని కారు



శింగనమల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరివిపల్లిలో గుర్తుతెలియని కారును వదిలేశారు. గ్రామంలో నాగేశ్వర రెడ్డి ఇంటి సమీపంలో 15 రోజులు కిందట రాత్రి సమయంలో ఏపీ04ఏవీ2088 నంబరు గల కారును గుర్తుతెలియని వ్యక్తులు వదిలేసి వెళ్లారు. కారు యజమానులు వచ్చి తీసుకు వెళతారని గ్రామస్థులు భావించారు. ఎవరూ రాకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో భర్త దుర్మరణం

భార్యకు గాయాలు


శ్రీహరినాయుడు (ఫైల్)

నంబులపూలకుంట, జూన్16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెడకంటివారిపల్లి సమీపాన సోమవారం ఎద్దుల బండిని బైక్ ఢీకొన్న ప్రమాదంలో ముక్కంవారిపల్లికి చెందిన శ్రీహరినాయుడు(36) దుర్మరణం చెందగా.. అతడి భార్య సింధూజ గాయపడింది. బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీహరినాయుడు స్వగ్రామమైన ముక్కంవారిపల్లి నుంచి భార్య సింధూజతో కలిసి ద్విచక్రవాహనంలో గాండ్లపెంటలోని రెక్కమానుకు ఇంటి సరుకులకోసం బయల్దేరాడు. మార్గమధ్యలో పెడకంటివారిపల్లి సమీపాన ఎదురుగా వస్తున్న ఎద్దుల బండి ఢీకొట్టింది. దీంతో శ్రీహరినాయుడు అక్కడికక్కడే మృతిచెందగా, సింధూజ గాయపడింది. ఆమెను కదిరి ప్రభుత్వాస్పత్రికి ప్రైవేటు వాహనంలో తరలించారు. శ్రీహరినాయుడుకు ఇద్దరు కుమారులు, ఆరు నెలల చిన్నారి ఉన్నారు. ఎస్ఐ వలీబాషా ప్రమాద స్థలాన్ని పరిశీలించి, శవాన్ని కదిరి ఆస్పత్రికి తరలించారు.

వాసాపురం బాబును కలిసిన పెద్దారెడ్డి

రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ


వాసాపురం బాబుతో భేటీ అయిన పెద్దారెడ్డి

బుక్కరాయసముద్రం, జూన్16(ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా కార్యదర్శి రవీంద్ర నాయుడు అలియాస్ వాసాపురం బాబును తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కలవడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. యల్లనూరు మండలానికి చెందిన వాసాపురం బాబు పార్టీ సరైన గుర్తింపు ఇవ్వలేదని అసంతృప్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం యల్లనూరు మండలంలోని వాసాపురం గ్రామంలో ఆయనను వైసీపీ మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి కలవడం రాజకీయ వర్గాల్లో పెను చర్చకు దారితీసింది.

పోక్సో కేసులో తండ్రీకొడుకుల అరెస్టు

అనంతపురం క్రైం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఇంటర్ విద్యార్థి, అతడి తండ్రిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. నగరానికి చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని, ప్రథమ సంవత్సరం విద్యార్థి ప్రేమించుకున్నారు. మైనర్లు ఇద్దరూ ఇటీవల రెండుసార్లు ఇంటి నుంచి పారిపోయారు. బాలిక తల్లిదండ్రులు పలుమార్లు చెప్పినా మార్పురాలేదు. మరోసారి బాలికను తీసుకుని ఒంగోలుకు పారిపోయాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో కేసు నమోదు చేసిన దిశ పోలీసులు.. బాలుడిని, అతడి తండ్రిని అరెస్టు చేశారు. నిందితులు ఇద్దరినీ రిమాండ్‌కు తరలించామని దిశ డీఎస్పీ మహబూబ్ బాషా తెలిపారు.

సచివాలయ సిబ్బంది బదిలీలకు శ్రీకారం

అనంతపురం న్యూటౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ సిబ్బంది బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందుకు అనుగుణంగా అర్హత కలిగిన సిబ్బంది వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో యంత్రాంగం నిమగ్నమైంది. అనంతపురం జిల్లాలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ పోస్టులు 483 ఉండగా.. 429 మంది పని చేస్తున్నారు. 54 ఖాళీలున్నట్లు అధికారులు తేల్చారు. శ్రీసత్యసాయి జిల్లాలో 420 పోస్టులు ఉండగా.. 334 మంది పనిచేస్తున్నారు. 85 ఖాళీలున్నాయి. వీరిలో ఉద్యోగంలో చేరినప్పట్నుంచి ఒకేచోట మే 31 వరకు పనిచేసిన వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే. ఐదేళ్లు పూర్తికాని వారు రిక్వెస్ట్ పెట్టుకోవచ్చు. ఆన్‌లైన్‌లో బదిలీకి దరఖాస్తు చేసుకోవాలి. ఖాళీల వివరాలు కూడా హెచ్ఆర్ఎంఎస్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచనున్నారు. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా బదిలీలు చేయనున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న స్థానంలో ఆర్థిక లావాదేవీలకు సంబంధించి బకాయిలు చెల్లించేవరకు రిలీవ్ చేయకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 18వ తేదీ వరకు మాడ్యూల్‌లో వివరాల నమోదుకు అవకాశం కల్పించారు. 22 నుంచి 24 వరకు ఆన్‌లైన్‌లో బదిలీల అభ్యర్థన పెట్టుకోవచ్చు. 25 నుంచి 29 వరకు వాటిని పరిశీలించనున్నారు. 30న ఏవైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించి కలెక్టర్ బదిలీల ప్రక్రియను పూర్తి చేయనున్నారు.

మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ల బదిలీ

అనంతపురం వైద్యం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచి ప్రొఫెసర్ స్థాయి వరకు పలువురికి బదిలీలు జరిగాయి. జూమ్ ద్వారా సోమవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మధు తెలిపారు. ఐదు సంవత్సరాల సర్వీసు పూర్తిచేసుకున్న వారు తప్పనిసరిగా బదిలీ అవుతారని తెలిపారు. పల్మనాలజీ ప్రొఫెసర్ డాక్టర్ రామస్వామి, పలువురు అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారని తెలిపారు.

ఆస్తి కోసమే అపహరణ

- మారుతమ్మను ఎత్తుకుపోయిన తల్లిదండ్రులు, బంధువులు
- మరిదిని పెళ్లి చేసుకోవాలని బెంగళూరులో చిత్రహింసలు
- కేసును ఛేదించిన పోలీసులు.. 11 మంది అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవిబాబు


టీచర్ మారుతమ్మ ప్రియుడు ఎర్రిస్వామి

కళ్యాణదుర్గం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయని మారుతమ్మను కన్న తల్లిదండ్రులు, బంధువులు ఆస్తి కోసం అపహరించారని డీఎస్పీ రవిబాబు తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బందితో కలిసి సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కేసు వివరాలను వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన మేరకు, కంబదూరు మండలం కురాకులపల్లి ప్రాథమిక పాఠశాలలో మారుతమ్మ ఎస్‌జీటీగా పనిచేస్తున్నారు. 2016లో ఆమెకు టీచర్ ఉద్యోగం వచ్చింది. బెళుగుప్ప మండలం తగ్గుపర్తి ఆమె స్వగ్రామం. ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులు ఆనంద్, శ్యామలమ్మ, చెల్లెలు మహాలక్ష్మిని ఆమె పోషిస్తున్నారు. కుటుంబ పోషణకు పోనూ మిగిలిన సొమ్ముతో 15 తులాల బంగారం, అనంతపురంలో ఓ ఇంటి స్థలం కొనుగోలు చేశారు. మారుతమ్మకు పెళ్లి చేస్తే తమ జీవనానికి ఇబ్బంది అవుతుందని తల్లిదండ్రులు, చెల్లెలు భావించారు. అందుకే ఉద్యోగం వచ్చి 9 సంవత్సరాలు గడిచినా మారుతమ్మ పెళ్లి చేయలేదు. మారుతమ్మ సుమారు 20 ఏళ్ల నుంచి బెళుగుప్ప మండలం తగ్గుపర్తికి చెందిన ఎర్రిస్వామిని ప్రేమిస్తున్నారు. ఎర్రిస్వామికి వివాహమై, ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. తల్లిదండ్రులకు ఇష్టం లేకున్నా ఎర్రిస్వామిని 20 రోజుల క్రితం మారుతమ్మ వివాహం చేసుకున్నారు. దీంతో వారు జీర్ణించుకోలేక పోయారు. ఎలాగైనా వారిని విడగొట్టాలని, లేదంటే చంపేయాలని తల్లిదండ్రులు, తమ్ముడు, మరిది, చెల్లెలు, మరో ఐదుగురు బంధువులు నిర్ణయించుకున్నారు. ఈ నెల 12న మారుతమ్మ పాఠశాలకు వెళ్లి బైక్‌పై ఎర్రిస్వామితో కలిసి తిరిగి వస్తుండగా కంబదూరు మండలం కోటగుడ్డం వద్ద అడ్డగించారు. ఎర్రిస్వామిని తోసేసి, మారుతమ్మను కిడ్నాప్ చేశారు. తండ్రి ఆనంద్‌తో పాటు మరో 9 మంది బొలెరో వాహనంలో ఆమెను ఎత్తుకుపోయారు. ఈ ఘటనపై ఎర్రిస్వామి కంబదూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మారుతమ్మను కుటుంబ సభ్యులు, బంధువులు బెంగళూరుకు తీసుకెళ్లి చిత్రహింసలు పెట్టారు. చెల్లెలు మహాలక్ష్మి భర్త ఎల్లప్పను పెళ్లి చేసుకోవాలని, ఆస్తి, డబ్బు తమకు ఇవ్వాలని, లేదంటే చంపేస్తామని బెదిరించారు. వారి నుంచి తప్పించుకునేందుకు మారుతమ్మ తెలివిగా ప్రవర్తించారు. మరిదిని పెళ్లి చేసుకుంటానని ఒప్పుకున్నారు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు ఆమెను బెంగళూరు నుంచి కళ్యాణదుర్గానికి తీసుకువస్తుండగా.. పోలీసులకు సమాచారం అందింది. కళ్యాణదుర్గం సమీపంలో ఈ నెల 15న నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మారుతమ్మను రక్షించారు. ఆమె తల్లిదండ్రులు ఆనంద్, శ్యామలమ్మ, చెల్లెలు మహాలక్ష్మి, మరిది ఎల్లప్పతోపాటు ఏడుగురు బంధువులను అరెస్టు చేశారు. వారి నుంచి బొలెరో, ద్విచక్రవాహనం, కత్తిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

మూడు రోజుల్లోనే ఛేదింపు

టీచర్ కిడ్నాప్ కేసును పోలీసులు మూడు రోజుల్లోనే ఛేదించారు. కళ్యాణదుర్గం రూరల్ సీఐ నీలకంఠేశ్వర్, టౌన్ సీఐ యువరాజు, రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, కంబదూరు ఎస్ ప్రవీణ్, బొమ్మనహాల్ ఎస్ఐ నబీరసూల్, కణేకల్ ఎస్ఐ నాగమధు, పోలీస్ సిబ్బంది రాజేష్, ఖాజా, మంజునాథ్, నాగార్జున, మోహన్ కృష్ణ, రాజ్యలక్ష్మి, ఎస్‌బీ కానిస్టేబుల్స్ ఆంజినేయులు, మోహన్ తదితరులను ఎస్పీ జగదీశ్ అభినందించారు.

విచ్చలవిడిగా మట్కా.. పేకాట..!

- నామమాత్రంగా దాడులు
- నిద్రావస్థలో పోలీసుశాఖ
- బహిరంగంగానే చీటీలు రాస్తున్న బీటర్లు


డీఎస్పీ కార్యాలయం

తాడిపత్రి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వివిధ రకాల పరిశ్రమలతో తాడిపత్రి ఆర్థికంగా ముందంజలో ఉంటుంది. అదే రీతిలో ఇక్కడ మట్కా, పేకాట కూడా విచ్చలవిడిగా సాగుతున్నాయి. గతంలో వాట్సాప్, ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే వారు. పోలీసులు పట్టించుకోకపోవడంతో ఇటీవల నేరుగానే బీటర్లు బహిరంగంగా చీటీలు రాస్తున్నారు. ఎక్కువ డబ్బులకు ఆశపడి నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి రోడ్డున పడుతున్నాయి. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య ఘర్షణలు చేసుకున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. తాడిపత్రి పట్టణం కర్నూలు, కడప, అనంతపురం మూడు జిల్లాలకు సరిహద్దు కావడంతో వేలమంది మట్కా ఆడడానికి కేంద్రబిందువు చేసుకున్నారు. నెల్లూరు, చిత్తూరు ప్రాంతాల నుంచి కూడా ఇక్కడికి వచ్చి మట్కా నిర్వహిస్తున్నారంటే ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. పోలీసులు నామమాత్రపు దాడులతో చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. వైసీపీ హయాంలో మట్కా బీటర్లకు కొందరు నాయకులు అండదండలు ఉండడంతో పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆనవాయితీని ప్రస్తుతం కూడా కొనసాగుతోందనే విమర్శలు ఉన్నాయి.

బహిరంగంగానే..

గతంలో వాట్సాప్, ఆన్‌లైన్‌లో మట్కాను ఆడేవారు. ప్రస్తుతం పోలీసు అధికారులు పట్టించుకోకపోవడంతో బీటర్లు రెచ్చిపోతున్నారు. బహిరంగంగానే చీటీలు రాస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. తాడిపత్రి ప్రాంతంలో పరిశ్రమలు ఎక్కువగా ఉండడంతో బతుకుదెరువు కోసం ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వందల సంఖ్యలో కూలీలు వలసవచ్చి జీవనం సాగిస్తున్నారు. సంపాదించిన కూలి డబ్బులను సాయంత్రమయ్యేసరికి మట్కా ఆడేందుకు ఆసక్తిచూపుతున్నారు. దీంతో సంపాదించిన డబ్బులు పోగొట్టుకొని అప్పులపాలవుతున్నారు. ఈ మధ్యకాలంలో కొందరు మహిళలు కూడా మట్కాకు బానిసలుగా మారుతున్నట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా పోలీసులు పట్టించుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నామమాత్రంగా దాడులు చేయడం.. చిన్నాచితక వారిని అరెస్ట్ చూపడం, కొంత డబ్బును స్వాధీనం చేసుకోవడం తప్ప.. ముఖ్యమైన వ్యక్తులను అరెస్ట్ చేయలేదన్న విమర్శలు ఉన్నాయి.

రాయలసీమలోనే తాడిపత్రి టాప్

ఒకప్పుడు జిల్లాలో తాడిపత్రి మట్కా కింగ్‌గా ఉండేది. దినదినాభివృద్ధి చెంది రాయలసీమలోనే టాప్ ర్యాంక్‌లో తాడిపత్రి నిలిచింది. మట్కా కేంద్రాలను నిర్వహించే డాన్‌లకు సైతం తాడిపత్రి స్థిరనివాసంగా ఉండేది. అప్పట్లో లక్షల్లో టర్నోవర్ చేసేవారు. ప్రస్తుతం మట్కా ఆడే వారి సంఖ్య పెరగడంతో టర్నోవర్ కూడా కోట్లకు చేరింది. తాడిపత్రి పట్టణం, పెన్నానది పరివాహక ప్రాంతంలోని తోటలు, పరిశ్రమల్లో విచ్చలవిడిగా పేకాట నిర్వహిస్తున్నారు. పట్టపగలే ఎక్కడపడితే అక్కడ పేకాటస్థావరాలు వెలుస్తున్నాయి. పెన్నానదిలో కూడా ఆడుతున్నారంటే పోలీసుల పనితీరు ఎలా ఉందో అర్థమవుతుంది.

చర్యలు తీసుకుంటాం..



తాడిపత్రి పట్టణ, పరిసర ప్రాంతాల్లో మట్కా, పేకాటపై దాడులు నిర్వహిస్తున్నాం. ఇంకా కొన్నిచోట్ల ఆడుతున్నారని తెలిసింది. వారిని కూడా త్వరలో పట్టుకుంటాం. వీటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. మట్కా, పేకాటపై కమిటీ ఏర్పాటు చేసి వివరాలు సేకరిస్తున్నాం. వీటిపై ప్రజలు సమాచారం ఇస్తే వారికి పారితోషికం కూడా అందజేస్తాం. వారిపేర్లను గోప్యంగా ఉంచుతాం.

- రోహిత్‌కుమార్ చౌదరి, ఏఎస్పీ

జగనన్న మాయాగృహాలు..!


- గత ప్రభుత్వంలో మోసం
- పట్టా ఇచ్చి.. స్థలం చూపని దుస్థితి..
- ఇల్లు కూడా మంజూరు చేశారట..
- పేదల సొంతింటి కలపై నీళ్లు

> గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న లేఅవుట్లలో మాయాజాలమే ప్రదర్శించారు. కొందరికి ఇళ్ల పట్టాలిచ్చారు. స్థలం ఎక్కడో చూపలేదు. అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకున్న పాపాన పోలేదు. కనీసం లేఅవుట్‌ను కూడా చదును చేయలేదు. ఐదేళ్లూ అలానే గడిపేశారు. పేదల సొంతింటి కలపై నీళ్లు చల్లారు. కొత్త ప్రభుత్వంలోనైనా ఆ కల నెరవేర్చుకుందామని పేదలు.. ఇంటి కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెళితే పెద్ద షాక్. గత ప్రభుత్వంలో స్థలంతోపాటు ఇల్లు కూడా మంజూరు చేసినట్లు ఆన్‌లైన్‌తో చూపుతోంది. ఇంటి కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా లేకుండా పోయింది. దీంతో పేదలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

నల్లమాడ, జూన్16(ఆంధ్రజ్యోతి): నల్లమాడలో నిరుపేదల కోసం గత వైసీపీ ప్రభుత్వం స్థలాలిచ్చి, ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చింది. జగనన్న కాలనీ ఏర్పాటుకు ఉపక్రమించింది. నల్లమాడ సమీపంలోని పాతరకుంట వద్ద ప్రభుత్వ, ప్రైవేటు భూములు 18 ఎకరాలు సేకరించారు. ఆ భూమిలో చిన్న చిన్న గుట్టలు, బండరాళ్లు ఉన్నాయి. వాటిని తొలగించి, చదును చేసేందుకు రూ.60లక్షలతో ప్రతిపాదనలు పంపారు. ఆ పనులు ఇద్దరు కాంట్రాక్టర్లకు అప్పగించారు. వారు సొంత నిధులు వెచ్చించి చదును చేశారు. అనంతరం ఆ భూమిలో అర్హులైన వారందరికీ పట్టాలిస్తామని చెప్పి 500 మందికిపైగా పేర్లను రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు సమాచారం. ఇందులో 200 మందికి ఇళ్ల పట్టాలిచ్చినట్లు తెలుస్తోంది. స్థలం ఎక్కడుందో చూపలేదు. వారికి ఇళ్లు కూడా మంజూరుకాలేదు. పట్టాలిచ్చారనీ, ఇల్లు కూడా మంజూరు చేస్తారని పేదలు సంబరపడ్డారు. వారి ఆశలపై గత ప్రభుత్వం నీళ్లు చల్లింది. భూమిని చదును చేసిన కాంట్రాక్టర్లకు రూ.60లక్షల బిల్లులు కూడా రాలేదు. 18 ఎకరాల్లో రోడ్డు, నీటి సౌకర్యం, విద్యుత్ స్తంభాలుకానీ ఏర్పాటు చేయలేదు. మండలంలోని దొన్నికోట, పులగంపల్లి, బొంగపల్లి, రామాపురం, రెడ్డిపల్లి, ఎర్రవంకపల్లి తదితర పంచాయతీల్లో జగనన్న కాలనీల పేరుతో రూ.లక్షలు ఖర్చు చేసి గ్రామాలకు దూరంగా ప్రభుత్వ భూములను చదును చేశారు. వాటిలో అరకొరగానే ఇళ్లు మంజూరు చేశారు. కొంతమంది మాత్రమే ఇళ్లు నిర్మించుకున్నారు. రెండు పంచాయతీల్లో మినహా జగనన్న కాలనీలన్నీ పిచ్చిమొక్కలు, కంపచెట్లతో దర్శనమిస్తున్నాయి. గతంలో లబ్ధిదారులు.. అధికారుల వద్దకెళ్లి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారు. ఇళ్లు మంజూరు చేయలేదు, కట్టలేదు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా సొంతింటి కల నేరవేర్చుకోవాలని లబ్ధిదారుల భావించారు. అధికారుల వద్దకెళ్లి పరిశీలించి గత ప్రభుత్వంలో ఇల్లు మంజూరైందనీ, మళ్లీ ఆన్‌లైన్ చేయడం కుదరదని చెబుతున్నారు. ఇలాంటి సమస్య ఉన్నవారు ఎక్కువమంది ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేసి, ఇళ్లు మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


నల్లమాడ వద్ద జగనన్న కాలనీ కోసం చదును చేసిన భూమి

పట్టాలిచ్చారు.. స్థలాలు చూపలేదు



గత వైసీపీ ప్రభుత్వంలో నల్లమాడ సమీపంలో చదును చేసిన భూమి లో కొంతమందికి ఇంటి పట్టాలు మంజూరు చేశారు. స్థలాలు చూపించలేదు. ఇళ్లు మంజూరు చేయలేదు. ఈ సమస్యలను అధికారుల దష్టికి తీసుకెళ్లినా, లబ్ధిదారులకు న్యాయం చేయలేదు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనలు చేపడతాం.

-కుచ్చెపు చంద్ర, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి

వసతులు కల్పించాక పట్టాలిస్తాం

నల్లమాడ సమీపంలో ఉన్న జగనన్న లేఅవుట్‌లో వసతులు కల్పించాల్సి ఉంది. భూమి కూడా పూర్తిస్థాయిలో చదును చేయాల్సి ఉంది. పనులు పూర్తయిన వెంటనే ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టాలు అందజేస్తాం.

-రంగనాయకులు, తహసీల్దార్, నల్లమాడ

సీనియర్ వన్డే క్రికెట్ టోర్నీ విజేత నెల్లూరు


ట్రోఫీతో నెల్లూరు జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ సీనియర్ వన్డే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల విజేతగా నెల్లూరు జట్టు నిలిచింది. సోమవారం స్థానిక అనంతపురం క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ సీనియర్ వన్డే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల ఫైనల్ రౌండ్ పోటీలు నిర్వహించారు. అనంతపురం-నెల్లూరు జట్లు తలపడగా..మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం 48.5 ఓవర్లలో 295 పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్లు ఎంకే దత్తారెడ్డి 58, అర్జున్ టెండూల్కర్ 43, మహేంద్రరెడ్డి 58, రాజుకుల్లాయప్ప 44 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన నెల్లూరు 49.4 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 296 పరుగులు సాధించింది. బ్యాటర్లు రేవంత్‌రెడ్డి 88, భాజీ 47 పరుగులు చేశారు. దీంతో నెల్లూరు వికెట్ తేడాతో గెలుపొందింది. మరో మ్యాచ్ కడప, కర్నూలు జట్ల మధ్య జరగగా...మొదట బ్యాటింగ్ చేసిన కడప నిర్దీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 285 పరుగులు సాధించింది. బ్యాటర్లు దనుష్ 77, జయవర్ధన్ 57 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన కర్నూలు కడప బౌలర్ల ధాటికి 179 పరుగులకే కుప్పకూలింది. సూర్యతేజ 45, సంజయ్‌నాయుడు 42పరుగులు చేశారు. కడప బౌలర్ దనుష్ 4, ఆరిఫ్‌బాషా 3 వికెట్లు సాధించి జట్టుకు 106 పరుగుల విజయాన్ని అందించారు. పాయింట్ల ఆధారంగా నెల్లూరు 16 విజేతగా, తరువాతి స్థానాల్లో కడప, అనంతపురం, చిత్తూరు, కర్నూలు జట్లు నిలిచాయి. అనంతరం విజేత జట్టుకు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

మార్కెట్‌కు వెయ్యి టన్నుల చీనీ

అనంతపురంరూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం వెయ్యి టన్నులకు పైగా చీనీ ఉత్పత్తులు వచ్చాయి. ఉమ్మడి అనంత జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తంగా 1119టన్నుల కాయలు మార్కెట్‌కు వచ్చాయని మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. టన్ను గరిష్ఠంగా రూ.32వేలు, కనిష్ఠంగా రూ.5వేలు, సరాసరి రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రాన్ని నాశనం చేశారు

- వైసీపీ నాయకులపై జేసీపీఆర్ ఫైర్


మాట్లాడుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, జూన్16(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు ఐదేళ్లు రాష్ట్రాన్ని నాశనం చేసి అధోగతి పట్టించి వెళ్లిపోయారని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం స్థానిక నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వైసీపీ నాయకులు పేర్నినాని, దేవినేని అవినాష్, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు మంచితనమే మిమ్మల్ని కాపాడుతోందని అన్నారు. రాష్ట్రాన్ని చక్కదిద్దాలంటే చంద్రబాబుకే సాధ్యమవుతుందన్నారు. ఆయన మూడునెలలు పర్మిషన్ ఇస్తే టీడీపీ కార్యకర్తల సత్తా ఏమిటో చూపిస్తారని తెలిపారు. లోకేష్ యాత్ర పెడితే అడ్డుకోవడమే కాకుండా మాట్లాడుతున్న మైకును గుంజుకోలేదా అని ప్రశ్నించారు. పేర్నినాని భార్యపైన కేసులు పెట్టారని బాధపడుతున్నాడని, పేదలకు ఇచ్చిన బియ్యాన్ని నొక్కేయడం సిగ్గు అనిపించలేదా అని ప్రశ్నించారు. తన భార్య మీద 10 కేసులు, కోడలిమీద రెండు కేసులు పెట్టిన ఘటనలు.. తమ ఇంటిలోకి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వచ్చి వెళ్లినది మర్చిపోయారా అని ప్రశ్నించారు. టీడీపీ కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు పడి, ఎంతో కష్టపడి పార్టీని గట్టెక్కించారని అన్నారు. చంద్రబాబునాయకుడు కేవలం రాష్ట్ర అభివృద్ధి కోసమే పనిచేస్తున్నారని, ఆయనకు కక్షసాధింపులు లేవని తెలిపారు. అందువల్లే మీరు ప్రశాంతంగా తిరగగలుగుతున్నారని వైసీపీ నాయకులకు గుర్తు చేశారు.

సోనాక్షి..!

స్కేటింగ్‌లో బుక్కరాయసముద్రం చిన్నారికి గోల్డ్‌మెడల్



బుక్కరాయసముద్రం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఐదేళ్ల చిన్నారి సోనాక్షి స్కేటింగ్‌లో అదరగొట్టింది. కుమ్మర వేణుగోపాల్, మౌనిక దంపతుల కుమార్తె సోనాక్షి ఇటీవలే తిరుపతిలో నిర్వహించిన స్కేటింగ్ జోనల్ ర్యాంకింగ్ టోర్నీలో గోల్డ్‌మెడల్ సాధించింది. చిన్నారిని కోచ్‌లు, గ్రామస్థులు అభినందించారు.

పంచాయతీరాజ్‌లో సీతయ్య..!

- ఎవరి మాటా వినడు.. ఎక్కడ పనిచేసినా వివాదమే..
- నాయకుల పేర్లు చెబుతూ బెదిరింపులు
- చోద్యంచూస్తున్న ఉన్నతాధికారులు..

అనంతపురం న్యూటౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖ పరిధి పీఆర్ఐ సబ్‌డివిజన్-2లో ఓ జేఈ సీతయ్యలా వ్యవహరిస్తున్నాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు అంటే లెక్కలేనితనం. ఏకంగా వారి చాంబర్లలోకే వెళ్లి గట్టిగట్టిగా అరుస్తాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయినా, ఉన్నతాధికారులు చోద్యం చూశారట. ఎందుకంటే ఆ జేఈ.. రాజకీయ నాయకుల పేర్లు చెప్పి బెదిరింపులకు దిగుతాడన్న చర్చ సాగుతోంది. ఆయన విషయాల్లో కలుగజేసుకోవాలంటే ఉన్నతాధికారులు సైతం ఆలోచిస్తారట. ఎందుకులే అని వదిలేస్తారని చర్చ సాగుతోంది. ఉన్నతాధికారుల పరిస్థితే అలా ఉంటే.. కిందిస్థాయి ఉద్యోగుల గురించి వేరే చెప్పక్కర్లేదు. ఆ జేఈ.. చుక్కలు చూపిస్తాడన్న ప్రచారం జోరుగా సాగుతోంది. దీంతో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పని చేయాలంటే బెంబేలెత్తిపోతున్నారని తెలుస్తోంది. ఆ జేఈ నోటి దురుసుతో విసుగు చెందిన సిబ్బంది బదిలీపై వెళ్లిపోవాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ఆ జేఈ సబ్ డివిజన్‌కు వెళ్లేవారే లేరంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు తిలోదకాలిచ్చినా.. ఆ జేఈని నిలదీసే సాహసం ఉన్నతాధికారులే చేయలేకపోతున్నారట.

నేటి నుంచి కేంద్ర కమిటీ పర్యటన

అనంతపురం అర్బన్ , జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యులు శంకర్, గౌతమ్ మంగళవారం నుంచి జిల్లాలో పర్యటించనున్నారు. సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యుల పర్యటన షెడ్యూల్ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డ్వామా పీడీ సలీం బాషా పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు కమిటీ సభ్యులు జిల్లాకు చేరుకుంటారు. సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ వినోద్‌కుమార్‌తో సమావేశమవుతారు. సాయంత్రం 5 గంటలకు డ్వామా కార్యాలయంలోని జలశక్తి కేంద్రాన్ని సందర్శిస్తారు. ఈనెల 18న ఉదయం 9 గంటలకు శింగనమల మండలం సోదనపల్లి, పెరవలి గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్యకలాపాలను పరిశీలిస్తారు. చెక్ డ్యాంల పరిశీలనతోపాటు చిజిల్ నాగలితో లోతు దుక్కి చేయడాన్ని పరిశీలిస్తారు. అనంతరం రైతులతో ముఖాముఖిగా మాట్లాడతారు. 11 గంటలకు తాడిపత్రిలో మురుగునీటి శుద్ధికర్మాగారాన్ని పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు తాడిపత్రిలోని ఆలూరులో చెక్ డ్యాంలు, మెషిన్ ఫాంపాండ్స్‌ను పరిశీలిస్తారు. 3.30 గంటల నుంచి గార్లదిన్నె మండలంలో ఇంకుడు గుంతలు, ఫాం పాండ్స్, మిద్దెపై పడిన వర్షపు నీటిని సేకరించే పద్ధతిని పరిశీలిస్తారు. ఈనెల 19వతేదీ ఉదయం 9 గంటలకు కూడేరు మండలంలోని పీఏబీఆర్ డ్యామ్‌ను పరిశీలిస్తారు. అనంతరం ఆత్మకూరు, కళ్యాణదుర్గం మండలాల్లో పర్యటిస్తారు. మధ్యాహ్నం రాయదుర్గం మండలంలో పలు రకాల పనులను పరిశీలిస్తారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.కే. శంకరనారాయణ కాంప్...

చిలకమర్తి లక్ష్మీ నరసింహం (వర్ధంతి)



ప్రముఖ తెలుగు సంస్కర్త చిలకమర్తి లక్ష్మీనరసింహం 1867 సెప్టెంబరు 26న పశ్చిమ గోదావరి జిల్లా పెరవలి మండలంలోని ఖండవల్లి గ్రామంలో జన్మించారు. కవి, రచయిత, నాటక కర్త, పాత్రికేయుడు, విద్యావేత్తగా బహుముఖ ప్రజ్ఞాశాలి. 19వ శతాబ్దం చివర, 20వ శతాబ్దపు ఆరంభంలో తెలుగు సాహిత్య అభివృద్ధికి, తెలుగు నాట ఆధునిక భావాల వికాసానికి పట్టుగొమ్మలలో ఒకరిగా నిలిచారు. 22వ యేట ఆయన రచించిన 'గయోపాఖ్యానం' అనే నాటకం ప్రతులు లక్షకుపైగా అమ్ముడుపోవడం తెలుగుసాహిత్య చరిత్రలో ఒక రికార్డుగా నిలిచింది. 30వ యేట రేచీకటికి గురైనా అధిగమించి రచనలు చేశారు. ఆంధ్రదేశంలో నిమ్న వర్గాల వారికి ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేసిన ఘనత చిలకమర్తికే దక్కుతుంది. కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొన్నారు. కొద్దికాలం అష్టావధానం చేశారు. 1946 జూన్ 17న కన్నుమూశారు.

తిరుమల రామచంద్ర (జయంతి)



స్వాతంత్ర్య సమరయోధుడు తిరుమల రామచంద్ర 1913 జూన్ 17న అనంతపురం జిల్లా ధర్మవరం తాలూకాలో జన్మించారు. సంపాదకుడు, రచయిత, భాషావేత్త. మాతృభాష తెలుగుతోపాటు కన్నడ, తమిళ, సంస్కృతం తదితర భాషల్లో ప్రావీణ్యం కల్గినవారు. విజయనగర సామ్రాజ్యంలో కానవచ్చే తాతాచార్యుల వంశీయులు. వేటూరి ప్రభాకరశాస్త్రికి ఏకలవ్య శిష్యుడిగా చెప్పుకొనే ఆయన విద్వాన్ విశ్వం వంటి వారితో పనిచేశారు. ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, ఆంధ్రభూమి తదితర పత్రికలలో వివిధ హోదాల్లో పనిచేశారు. సాహిత్య అకాడమీ పురస్కారం, పత్రికార శిరోమణి, కళా సరస్వతి ఇతర గౌరవాలు అందుకున్నారు. 1997 అక్టోబరు 12న కన్నుమూశారు.

లియాండర్ పేస్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' పురస్కార గ్రహీత లియాండర్ అండ్రియన్ పేస్ 1973 జూన్ 17న పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్కత్తాలో జన్మించారు. టెన్నిస్ క్రీడాకారుడైన ఆయన డేవిస్‌కప్ టీమ్‌కు కేప్టెన్‌గా వ్యవహరించారు. డబుల్స్‌లో 8, మిక్స్‌డ్ డబుల్స్‌లో 10 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌ను సాధించారు. 1999 వింబుల్డన్‌లో సత్తా చాటుకున్నారు. 1992 నుంచి 2016 వరకు జరిగిన ఒలింపిక్స్ పోటీల్లో వరుసగా ప్రాతినిధ్యం వహించారు. కాంస్య పతకం సహా పలు మెడల్స్ అందుకుని దేశ గౌరవాన్ని ఇనుమడింపచేశారు. రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న, అర్జున అవార్డు, పద్మశ్రీ వంటి ఉన్నత పురస్కారాలు అందుకున్నారు. 2024 జులైలో ఇంటర్నేషనల్ టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేంలో చోటు దక్కించుకున్నారు.

ఇరగంపల్లి ఇంట్లో నగదు, నగలు చోరీ



చోరీ వివరాలు సేకరిస్తున్న పోలీసులు

చింతామణి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ముంగానహళ్ళి హోబళి ఇరగంపల్లిలో ఓ ఇంటి బీగాలు తెరచి దొంగలు లోపలికి చొర బడ్డారు. సుమారు రూ.2లక్షల విలువైన సొత్తు చోరీకి గురైనట్టు తెలు స్తోంది. ఆదివారం ఉదయం యథాప్రకారం తోటకు బయల్దేరారు. ఇంటి యజమానురాలు శిల్పా తాళం వేసి కీని సమీపంలోని ఒక గూటిలో ఉంచారు. మధ్యాహ్నం భోజనానికి రాగా చోరీ జరిగినట్టు గుర్తించారు. కీ యథాస్థానంలోనే ఉంది. కాగా బీరువాలోని వస్తువులు చిందరవందర చేశారు. 18 గ్రాముల బంగారు నగలు, 190 గ్రాముల వెండి, రూ.5వేల నగదు చోరీకి గురైనట్టు శిల్పా తన ఫిర్యాదులో పేర్కొన్నారు. బట్లహళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నాటుసారాను అరికట్టాలి

● మహిళల ధర్నా

గుడిబండ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీఎన్ తండాలో నాటుసారాను అరికట్టాలని కోరుతూ మహిళా సంఘాల సభ్యులు గుడిబండ తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. సోమవారం జీఎన్ తండా గ్రామానికి చెందిన మహిళా సంఘం సభ్యులు పెద్దఎత్తున తరలివెళ్లి బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో నాటుసారా తయారు చేయడం, విక్రయించడంవల్ల చిన్న పెద్ద అనే తేడాలేకుండా సేవించి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. దీంతో ఎన్నో కుటుంబాలు వీధినపడుతున్నాయన్నారు. నాటుసారా సేవించి గ్రామాల్లో ప్రతి రోజూ గొడవలు జరుగుతున్నాయన్నారు. అధికారులు స్పందించి నాటుసారా తయారీ, విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీటీ కళ్యాణచక్రవర్తికి అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం తిప్పన్న, సీసీ శ్రీధర్, యానిమేటర్ నాగభూషణ, గ్రామ మహిళా సంఘం సభ్యులు భీమబాయి సుశీలమ్మ, అమల, భారతి, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

పెనుకొండ రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ఈజీఎస్ కింద సాగుచేసే రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలని ఎంపీడీఓ నరేష్‌కృష్ణ సూచించారు. సోమవారం పట్టణంలోని మండలపరిషత్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పండ్లతోటలపై వచ్చే రాయితీలను వివరించారు. రసాయన ఎరువులు తగ్గించి సేంద్రీయ ఎరువులు వాడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బస్టాండ్‌లో మౌలిక సదుపాయాల కొరత

విజయపుర, జూన్ 17(ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మౌలిక సదుపాయాల కొరత ఉంది. పట్టణం నుంచి బెంగళూరు, కోలారు, చిక్కబళ్ళాపుర, శిడ్లఘట్ట, తుమకూరు, తిరుపతి, బెంగళూరు గ్రామీణ ప్రాంతాలకు బస్సులు రాకపోకలు ఉన్నాయి. సమీపంలో పట్టు మార్కెట్ ఉండడంతో కొన్ని సమయాల్లో రద్దీ అధికంగా ఉంటుంది. శక్తి పథకం ద్వారా మహిళా ప్రయాణీకుల సంఖ్య పెరిగింది. ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూళ్లు, కళాశాల విద్యార్థుల డిమాండ్‌కు అనుగుణంగా తగినన్ని బస్సులు లేవు. నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగించే బస్టాండ్‌లో తగినన్ని ప్రయాణీకులు కూర్చోవడానికి తగినన్ని బెంచీలు లేవు. తాగునీరు సదుపాయం లేదు, శౌచాలయం ఉన్నా నిర్వహణ కొరత ఉంది. రాత్రివేళల్లో తగినంత వెలుగు లేకపోవడంతో తాగుబోతుల తాకిడి అధికంగా ఉందని పలువురు ప్రయాణీకులు వాపోతున్నారు. బస్టాండ్‌లో మౌలికసదుపాయాలు పెంచాలని ప్రజలు కోరుతున్నారు.



విజయపుర బస్టాండ్



నామమాత్రంగా ఆసన వ్యవస్థ



పనిచేయని తాగునీటి కొళాయి

ల్యాప్‌టాప్, నగదు ప్రయాణికుడికి అప్పగింత

» మానవత్వం చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది - నిజాయతీకి ప్రశంసలు

బాగేపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): బస్సులో మరిచిపోయిన ల్యాప్‌టాప్, నగదును ప్రయాణీకుడికి తిరిగి అప్పగించడం ద్వారా ఆర్టీసీ సిబ్బంది మానవత్వాన్ని చాటుకున్నారు. బాగేపల్లి ఆర్టీసీడిపోకు కేఎస్ఆర్టీసీ బస్సు చేరుకుంది. చిక్కబళ్ళాపుర నుంచి బాగేపల్లికి బస్సులో ప్రయాణించిన నరసింహయ్య అనే వ్యక్తి తన ల్యాప్‌టాప్, రూ.27వేల నగదు మరచి వెళ్లాడు. డిపోకు చేరుకున్న అనంతరం కండక్టర్ బహదూర్ సాబ్, డ్రైవర్ లక్ష్మీనరసింహయ్యలు గమనించి డిపో సెక్యూరిటీకి అప్పగించారు. వాటిని సొంతదారులకు అప్పగించాలని కోరారు. ఆమేరకు ప్రయాణీకుడు నరసింహయ్యను గుర్తించి డిపోకు రప్పించి ల్యాప్‌టాప్, రూ.27వేల నగదును వాపసు ఇచ్చారు. డిపో మేనేజర్ శ్రీనివాసమూర్తి సమక్షంలో అందచేశారు. అనంతరం శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ కేఏ40ఎఫ్ 1403 బస్సు డ్రైవర్, కండక్టర్‌లు నిజాయితీగా వ్యవహరించి మానవత్వం చాటారన్నారు. డ్రైవర్, కండక్టర్‌లను ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ సిబ్బంది మహ్మద్ ఖలీద్, వేణుగోపాల, రవి, గూళూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రయాణికుడికి ల్యాప్‌టాప్, నగదును అందజేస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసమూర్తి, డ్రైవర్, కండక్టర్

జీవితచరిత్ర సినిమాకు సాలుమరద తిమ్మక్క అభ్యంతరం



మీడియాతో సాలుమరద తిమ్మక్క తదితరులు

బెంగళూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): నా అనుమతి లేకుండానే నా జీవిత చరిత్రతో సినిమా తీయాలని ప్రయత్నిస్తున్నారని పద్మశ్రీ గ్రహీత సాలు మరద తిమ్మక్క అభ్యంతరం వ్యక్తం చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో తిమ్మక్క మీడియాతో మాట్లాడుతూ కొన్నేళ్లకాలంగా ఎంతోమంది జీవనాధారంగా సినిమా తీసేందుకు కోరారన్నారు. వ్యక్తిగత అంశంతో సినిమా వద్దని నిరాకరించామన్నారు. ఇటీవల దిలీప్‌కుమార్ అనే వ్యక్తి అనుమతులు కోరారన్నారు. తాము అభ్యంతరం తెలిపామన్నారు. కానీ నెలరోజుల తర్వాత సినిమా తీశామని, ఇప్పటికే సగం పూర్త అయ్యిందనే సమాచారం వచ్చిందన్నారు. ఇప్పటివరకు నా పేరిట ఏ సినిమాకు సంబంధించి కూడా అనుమతులు ఇవ్వలేదన్నారు. కానీ ఇటీవల సినిమా తీస్తున్నవారు మమ్మల్ని బెదరిస్తున్నారన్నారు. అంగీకరించకపోతే బ్లాక్‌మెయిల్ చేస్తున్నారన్నారు. కోర్టులో పరువునష్టం దావా వేస్తామని తెలిపారు. ఆమె పెంపుడు కుమారుడు ఉమేశ్‌తోపాటు పలువురు ఉన్నారు.

యూత్ కాంగ్రెస్‌కు ప్రాధాన్యం

బొమ్మనహళ్ళి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కేపీసీసీ ఆదేశాలమేరకు బొమ్మనహళ్ళి నియోజక వర్గంలో యూత్‌కాంగ్రెస్‌కు ప్రాధాన్యం ఇస్తూ బొమ్మనహళ్ళి, హెచ్ఎస్ఆర్ లే అవుట్, బిలేకహళ్ళి వార్డులకు నూతన బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులను నియమించారు. ఇదివరకు ఉన్న పదాధికారుల ఐదేళ్ల పదవీకాలం ముగియడంతో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేస్తున్నట్టు మంత్రి రామలింగారెడ్డి తెలిపారు. సీనియర్లను నిర్లక్ష్యం చేయలేదని, బ్లాక్ కాంగ్రెస్ స్థాయిలో యువతకు ప్రాధాన్యత ఇచ్చేలా పార్టీ ఆదేశించిందన్నారు. బొమ్మనహళ్ళి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మధు టి, హెచ్ఎస్ఆర్ లే అవుట్‌కు ఎంఆర్ రాఘవేంద్ర, బిలేకహళ్ళి నుంచి ధనంజయ ఎంపిక చేసినట్టు తెలిపారు. కోరమంగలలోని మంత్రి కార్యాలయంలో సోమవారం పదాధికారులకు నియామకపత్రాలు అందచేసి అభినందించారు. ముగ్గురు పదాధికారులను సత్కరించారు. వచ్చే బీబీఎంపీ ఎన్నికలు, ఇతర ఎన్నికల్లోనూ పార్టీ విజయం సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ముగ్గురూ కూడా మాట్లాడుతూ పార్టీ విజయానికి తమవంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు పాల్గొన్నారు.



బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులకు నియామకపత్రాలు అందచేస్తున్న మంత్రి రామలింగారెడ్డి

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

శిడ్లఘట్ట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తాలూకాకు చెందిన రామచంద్రగౌడ చిక్కబళ్ళాపుర జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా ఎంపికైన అనంతరం ఎంపీ కే సుధాకర్‌తో కలసి చిక్కబళ్ళాపుర తాలూకాలోని పురాతన ఆలయమైన భోగనందీశ్వర ఆలయాన్ని సందర్శించారు. సోమవారం ఆలయంలో విశేషపూజలు జరిపించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు జిల్లా అధ్యక్షస్థానం కల్పించేందుకు సహకరించిన ఎంపీ సుధాకర్‌కు ధన్యవాదాలు తెలిపారు. పార్టీని బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా బీజేపీ తాలూకా అధ్యక్షుడు సీకల్ ఆనందగౌడ, పట్టణ అధ్యక్షుడు నరేశ్, మాజీ అధ్యక్షుడు సురేంద్రగౌడ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ సుధాకర్, రామచంద్రగౌడకు ఆత్మీయ స్వాగతం

ప్రజా ప్రయోజనానికే నూతన వంతెన నిర్మాణం

● ఎమ్మెల్యే గణేష్

కంప్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రయోజనం కోసమే కంప్లి కోటె వద్ద నూతన వంతెన నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే గణేష్ అన్నారు. తుంగభద్ర నదిపై నూతన వంతెన నిర్మాణం కోసం పీడబ్ల్యూడీ శాఖ మంత్రి సతీష్ జార్కిహోళి కంప్లి కోటె వద్ద తుంగభద్ర నదిపై ఉన్న వంతెనను వీక్షించడానికి వస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే మంత్రి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసి కోట వద్ద కొత్త వంతెనను ప్రారంభిస్తే పనులు కూడా త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. ఈ వంతెన నిర్మాణంతో ఈ ప్రాంత రైతులు, విద్యార్థులు, ప్రయాణికులకు ప్రయోజనకరంగా వుంటుందని అన్నారు. ఉదయం ఎమ్మిగనూరు వద్ద కళ్యాణ్ పథ్ ప్రాజెక్టు కింద రూ.6.10 కోట్ల వ్యయంతో తాలుకాలోని ఇటిగి, బీటీ రహదారి నిర్మాణానికి భూమిపూజ చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక్కడి వంతెన నిర్మించి 75 యేళ్లపైగా అయ్యిందన్నారు. వర్షాకాలంలో తుంగభద్ర జలాశయం నుంచి నదికి ఎక్కువగా నీరొస్తే ట్రాఫిక్ అంతరాయం కారణంగా రైతులు, ప్రయాణికులు, విద్యార్థులు చాలా సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. ఇక్కడ కొత్త వంతెన నిర్మించాలని విధానసభలో చర్చించడంతో మంత్రి స్పందించి వంతెనను పరిశీలించడానికి వస్తున్నట్లు తెలిపారు. నాబార్డు పబ్లిక్ వర్క్స్ నుంచి రూ.110 కోట్ల వ్యయంతో కంప్లి వంతెనను నిర్మించే అవకాశం వుందన్నారు. ఇప్పటికే రూ.కోటి వ్యయంతో కిలోమీటర్ సీసీ రోడ్డు నిర్మించారన్నారు. అలాగే 30 పడకల ప్రభుత్వాస్పత్రి, ఏపీఎంసీ మార్కెట్ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో పీడీవో తారా నాయక్, గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు శారద, సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

కోమాలో ఉన్న మహిళకు శస్త్రచికిత్స విజయవంతం

బెంగళూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కోమాలో ఉన్న 49 ఏళ్ల మహిళకు నగరంలోని వాసవి ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు విజయవంతం చేశారు. ఆక్సిజన్ కొరతతోపాటు శ్వాసకోశ సమస్యతో ఆసుపత్రిలో చేరగా అత్యవసర విభాగం చికిత్సలు జరిపింది. న్యూరో సర్జన్ ప్రథమ్ బైసాని తెలిపిన మేరకు ఈసీజీ ఎకోకార్డియోగ్రామ్, సిటీస్కాన్ వంటి పరీక్షలు జరిపామన్నారు. మెదడులో రక్తనాళం ఛిద్రమైనందుకు ఆమె కోమాలోకి వెళ్లినట్టు గుర్తించామన్నారు. రెండు రోజులపాటు పర్యవేక్షణలో ఉంచి సిటీ యాంజియోగ్రామ్‌ను జరిపామన్నారు. అ తర్వాత మూడు రోజులు ఐసీయూలో పర్యవేక్షించి తగిన చికిత్సలు కొనసాగించామన్నారు. ప్రస్తుతం ఆమె కోలుకున్నారని తెలిపారు.

సాహితీవేత్తకు కువెంపు పురస్కారం

బెంగళూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కన్నడ పోరాట నేత, సాహితీవేత్త, విద్యానిపుణుడు డాక్టర్ సత్యమూర్తికి జాతీయకవి కువెంపురత్న పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఆదివారం ఉదయభాను కళాసంఘంలో మైత్రి కళాబృందం పురస్కారాన్ని ప్రదానం చేసింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో సత్యమూర్తికి రాష్ట్రస్థాయి పురస్కారాన్ని ప్రదానం చేశారు. సాహితీవేత్త గుడలేఖ, ప్రశాంత్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



సత్యమూర్తికి పురస్కారంతో సన్మానం

రోడ్డు, డ్రైనేజీ పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మంజుళా లింబావళి

మహదేవపుర, జూన్ 16(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి భూమిపూజ చేశారు. మారగొండనహళ్ళి, రాంపుర, బయ్యప్పనహళ్ళి గ్రామాలలో ప్రధాన రోడ్డు, క్రాస్ రోడ్లను ప్రజాపనులశాఖ గ్రాంట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఈ సందర్భంగా గ్రామీణ హోబళి బీజేపీ అధ్యక్షుడు హరాడి పిళ్ళప్ప, ముఖ్యులు నటరాజ్, గణేశ, బిదరహళ్ళి రాజేశ్, మునిరాజు, మారుతి, నాగరాజ్, ధనంజయ్, గోపాలగౌడ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక రాయితీలు

బెంగళూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఫినిక్స్ షాపింగ్ ఫెస్టివల్ పేరిట నెలన్నరకాలం ప్రత్యేక ఆఫర్‌లను ప్రకటించారు. సోమవారం నుంచి జులై 31 వరకు ఆఫర్‌లు కొనసాగుతాయన్నారు. 50శాతం రాయితీలతోపాటు పలు ప్రైజ్‌లు పొందే అవకాశం ఉందన్నారు. జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్‌లు ఇక్కడ లభిస్తాయన్నారు.

రహదారుల నిర్మాణ సమస్యపై త్వరలో ఉన్నతస్థాయి సమావేశం

● ప్రజాపనుల శాఖ మంత్రి సతీశ్ జార్కిహోళి



మాట్లాడుతున్న మంత్రి సతీశ్ జార్కిహోళి

రాయచూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చేపట్టిన రహదారుల అభివృద్ధి పనులకు సంబంధించి ఎదురవుతున్న సమస్యల పరిష్కారం కోసం త్వరలో బెంగళూరులో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహిస్తామని ప్రజాపనుల శాఖ మంత్రి సతీశ్ జార్కిహోళి తెలిపారు. సోమవారం జిల్లాధికారి కార్యాలయంలో ప్రజాపనుల శాఖ ఆధ్వర్యంలో రహదారి నిర్మాణాలు, ఇతర పనులకు సంబంధించి ప్రగతి పరిశీలనపై సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన మంత్రి మాట్లాడుతూ జాతీయ రహదారుల నిర్మాణం అలైన్మెంట్ మార్పు అధికారం రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉండదని, ఇది కేంద్ర ప్రభుత్వం అధీనంలో ఉంటుందన్నారు. అదే సమయంలో జిల్లాలో జరుగుతున్న పనులు త్వరితగతిన పూర్తయ్యేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అదే సమయంలో పనులను ఎలాంటి లోపాలు లేకుండా పూర్తి చేయాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో పాల్గొన్న పలువురు ఎమ్మెల్యేలు రహదారుల నిర్మాణం సందర్భంగా రైతులు పొలాలకు వెళ్లేందుకు బాటలు సమస్యగా మారిందని మరికొన్ని చోట్ల రోడ్డు ఎత్తుగా ఉండడం వల్ల గ్రామాలకు వెళ్లే రోడ్లు సైతం ఇబ్బందులు పడాల్సి వస్తోందని మంత్రి దృష్టికి తెచ్చారు. హోలగుందా-రాయచూరు రహదారి పనులు నత్తనడకన సాగుతున్నాయని రాయచూరు ఎంపీ జీ కుమార్ నాయక్ మంత్రి దృష్టికి తెచ్చారు. రాయచూరు తింథిణి మార్గంలో ఒకే రోడ్డుకు రెండు చోట్ల టోల్‌గేట్లు ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులపై ఆర్థిక భారం పడుతుందని ఈ సమస్యను పరిష్కరించాలంటు దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ కోరారు. కాగా రోడ్ల నిర్మాణానికి సంబంధించి భూసేకరణలో కొంత రియల్ ఎస్టేట్ మాఫియా పాత్ర ఉన్నట్లు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్ మంత్రి దృష్టికి తెచ్చారు. వీటన్నింటిపై త్వరలోనే బెంగళూరు సమావేశంలో పరిష్కారం వెతుకుతామని మంత్రి హామీ ఇచ్చారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1604.49	1583.03
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	12,278	1,619
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	180	577
నీటి నిల్వ (టీఎంసీలు)	27.91	6.11

పండిత్ పంచాక్షరి గవాయి వర్ధంతి



నివాళి అర్పిస్తున్న కరాటే బాలురు, జగదీశ్

బళ్లారి సిటీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): నగర బాల భారతి పాఠశాల పంచాక్షరి మార్షల్ ఆర్ట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గానయోగి శివయోగిపండిత పంచాక్షరి గవాయి81వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సమాజ సేవకుడు జగదీశ్ మాట్లాడుతూ పండిత పంచాక్షరి గవాయి వేలాది మంది పిల్లలకు సంగీతంలో శిక్షణ ఇచ్చారన్నారు. రైతు సంఘం అధ్యక్షుడు పురుషోత్తమ గౌడ మాట్లాడుతూ క్షేత్రానికి పూజ్య సహకారం చాలా పెద్దదన్నారు. అనేక జిల్లాల సంగీత దర్శకులు పూజ్యులు స్థాపించిన వీరేశ్వర పుణ్యాశ్రమంలో సంగీతం నేర్చుకున్నారన్నారు. మహాత్ముల నిస్వార్థ సేవను స్మరించుకున్నారు. కార్యక్రమంలో జాలిహాల్ శ్రీధరగౌడ్, గాదిలింగప్ప, షడాక్షరి, అమరేశ్, శివానంద హడపద, శ్రీనివాసాచారి, కరాటే విద్యార్థి చైతన్య, ట్రస్టు అధ్యక్షుడు మృత్యుంజయస్వామి పాల్గొన్నారు.

డీఎస్పీ తనిఖీ



స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న డీఎస్పీ సంతోష్ చౌహాన్

బళ్లారిరూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తాలుకాలోని పరమదేవనహళ్లి పోలీస్ స్టేషన్‌ను సిరుగుప్ప ఇన్‌చార్జి డీఎస్పీ డాక్టర్ సంతోష్ చౌహాన్ సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను, రికార్డులను స్టేషన్లో ఉన్న పలు కేసులకు సంబంధించిన వివరాలను ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. ఏఎస్ఐ దుర్గా ప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, సురేష్, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం (హోస్పేట), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గనులు ప్రభావిత గ్రామాలలోని లబ్ధిదారుల కోసం డెయిరీ యూనిట్, 2 హెచ్‌పీ సామర్థ్యం గల మేతకోసే యంత్రం కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలని పశుసంవర్ధశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కోరారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలు, జనరల్ కేటగిరీ లబ్ధిదారులు అర్హులన్నారు. హోస్పేట తాలుకాలో డెయిరీ యూనిట్, 2హెచ్‌పీ సామర్థ్యం గల మేతకోసే యంత్రం నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 25వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. యూనిట్ ధర రూ.1.20 లక్షలు, రెండు సంకరజాతి ఆవులు, మెరుగైన గేదె యూనిట్, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు 90 శాతం సబ్సిడీ, జనరల్ కేటగిరీకు 60 శాతం సబ్సిడీ, మిగిలిన మొత్తాన్ని లబ్దిదారుల సహకారం లేదా బ్యాంకు రుణం, ఉచిత 2 హెచ్‌పీ సామర్థ్యం గల మేత కోసే యంత్రం ద్వారా పొందవచ్చన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మహిళలకు 33 శాతం ప్రాధాన్యం, దివ్యాంగులకు మూడు శాతం ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. తాలుకాలో నిర్మాణం కోసం మొత్తం 1,323 డెయిరీ యూనిట్లు, 104 మేత కోసే యంత్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

నేడు నిఖిల్‌కుమార్‌స్వామి పావగడకు రాక

పావగడ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కర్నాటక రాష్ట్ర జడీఎస్ పార్టీ యువ గటక అధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి మంగళవారం పావగడలో పర్యటించనున్నట్లు జేడీఎస్ తాలూకా అధ్యక్షుడు ఎన్ఏ ఈరన్న తెలిపారు. రానున్న జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి జేడీఎస్ పార్టీ బలోపేతానికి మిస్డ్‌కాల్ అభియాన కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. పట్టణంలోని శిర రోడ్డులో ఉన్న ఆంజనేయశెట్టి కల్యాణమండపంలో నిర్వహించే కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. జేడీఎస్ నాయకులు బలరాంరెడ్డి, శివకుమార్, రాజశేఖర్, జేడీఎస్ ప్రధాన కార్యదర్శి సొగడు వెంకటేశ్ హాజరవుతారన్నారు.

కాంట్రాక్టర్ల రింగ్..!

- బియ్యం వేలంలో 33 శాతం లెస్‌కు దక్కించుకున్న వ్యాపారి
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- కలెక్టర్ నిర్ణయంపై సర్వత్రా చర్చ

బళ్లారి గాంధీనగర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆహార పౌరసరఫరాలు, పోలీసు శాఖలు సంయుక్తంగా దాడులు నిర్వహించి సీజ్ చేసిన 4550.74 క్వింటాళ్ల రేషన్ బియ్యం ధర రూ.1,04,66,702, రూ.1,31,670 విలువ చేసే 63.20 క్వింటాళ్ల గోధుమలకు ఏపీఎంసీ మార్కెట్ ప్రాంగణంలో బహింగ వేలం ప్రక్రియ సోమవారం కొనసాగింది. ఈ వేలం ప్రక్రియలో జిల్లా ఆహార పౌరసరఫరాల అధికారులు నిబంధనలతో రూ.15లక్షల సెక్యూరిటీ డిపాజిట్ డీడీతో బళ్లారి, సింధనూరు, రాయచూరు, సిరుగుప్ప ప్రాంతాల నుంచి వ్యాపారులు, ట్రేడర్లు, రైస్‌మిల్లు ఓనర్లతో పాటు 21మంది పాల్గొన్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన వేలం ప్రక్రియ గంటసేపు ఆలస్యమైంది. ఆహార పౌరసరఫరాల శాఖ ముందుగా చెప్పిన నిబంధనల ప్రకారం వేలం పాటలో పాల్గొనే బిడ్డర్లు సెక్యూరిటీ డిపాజిట్‌గా ఒక్కొక్కరు రూ.15లక్షలు డీడీరూపంలో అందజేసిన వారే బిడ్డింగ్ ప్రక్రియలో పాల్గొన్నా... వేలం పాట పాడింది మాత్రం నలుగురే కావడం విశేషం. సాధారణంగా వేలం ప్రక్రియలో ప్రభుత్వం రేటు రూ.2300 నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా ఇందులో రివర్స్ టెండరు ప్రక్రియ కావడం విశేషం. వేలం ప్రక్రియలో క్వింటాల్ బియ్యం ధర రూ.వెయ్యి రూపాయలతో ప్రారంభమై.. 10, 20, 30 రూపాయల తేడాతో ఆఖరికి ధర రూ.1530లకు నిలిచిపోయింది. టెండరును సింధనూరుకు చెందిన మారుతి ట్రేడర్స్ దక్కించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. గతంలో జరిగిన బియ్యం వేలం టెండరులో ప్రభుత్వ రేటుకు అదనంగా బిడ్డర్లు బియ్యాన్ని కొనుగోలు చేయడంతో ప్రభుత్వం ఖజానాకు లక్షల్లో ఆదాయం చేకూరింది. అయితే ఈసారి జరిగిన బియ్యం బహిరంగ వేలం ప్రక్రియలో ప్రభుత్వం రేటుకంటే 33.6శాతం తక్కువగా వేలం పాడడంతో ప్రభుత్వానికి రూ.17.66లక్షలు మేర నష్టం వాటిల్లే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. సోమవారం జరిగిన ప్రక్రియలో



వేలం నిర్వహిస్తున్న అధికారులు

21మంది బిడ్డర్లకు గాను కేవలం నలుగురు మాత్రమే టెండరు కోట్ చేయడం వెనుక... పెద్ద తతంగమే నడిచిందని తెలుస్తోంది. ప్రభుత్వ ధర కంటే తక్కువ పాడి టెండరు దక్కించుకోవాలనే ఉద్దేశ్యంతో బిడ్డర్లను గుడ్‌విల్ కింద రింగ్ చేసుకుని ప్రభుత్వం ధర కంటే తక్కువగా పాడేలా నిర్ణయించుకుని వేలం ప్రక్రియలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఈ తతంగం అంతా నగరానికి చెందిన ఓ ప్రముఖ వ్యక్తి నడిపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం జరిగిన వేలం ప్రక్రియకు అధికారులు అంగీకరిస్తే ప్రభుత్వం ఖజానాకు రూ.17.66లక్షలకు పైగా నష్టం వాటిల్లే పరిస్థితి ఉందని ఆహార పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జరిగిన టెండరు ప్రక్రియను అంగీకరించడం, అంగీకరించకపోవడం అంతా జిల్లాధికారి చేతిలో ఉండడంతో వెలం పాటలో బిడ్డు దక్కించుకున్న వ్యాపారి సందిగ్ధంలో పడాల్సి వచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా వేలం పాట ప్రభుత్వానికి నష్టపరిచే రీతిలో జరగడంతో... జిల్లాధికారి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చడాల్సి ఉంది.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయండి

- 5వ ఆర్థిక సంఘం చైర్మన్ నారాయణస్వామి

బళ్లారి సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వివిధ ప్రభుత్వ పథకాలను సక్రమంగా ఉపయోగించుకోవడం ద్వారా గ్రామ పంచాయతీల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని 5వ ఆర్థిక సంఘం చైర్మన్ నారాయణస్వామి సూచించారు. నగరంలోని జిల్లా పంచాయతీ హాల్‌లో సోమవారం నిర్వహించిన 5వ ఆర్థిక సంఘం సంప్రదింపుల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలులో పరిపాలనా పరమైన సమస్యలను పరిష్కరించడానికి కమిషన్ సిఫార్సు చేస్తుందన్నారు. భవన నిర్మాణ వాణిజ్య దుకాణాల పన్ను, ఆస్తిపన్ను, వ్యాపార లైసెన్స్, అద్దె ఆదాయం, వినియోగదారుల రుసుములు తదితర వాటి వసూలును సక్రమంగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. పట్టణ స్థానిక సంస్థలు, పంచాయతీరాజ్ సంస్థలు తమ సొంత వనరులను సమీకరించుకోవడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పట్టణ సంస్థలకు సంబంధించి పన్ను చెల్లింపు రశీదులను సత్వరమే జారీ చేయడం, నీటి సరఫరా మురుగునీటి పారుదల, వీధి దీపాలు, ఘనవ్యర్థాల నిర్వహణ, ఇతర అంశాలను వివిధశాఖల అధికారులు వివరించారు. గ్రామ పంచాయతీ, స్థానిక సంస్థలకు ప్రాథమిక సౌకర్యాలు



మాట్లాడుతున్న చైర్మన్ నారాయణస్వామి

కల్పించడానికి మరిన్ని నిధులు వివిధ అనుమతుల అవసరం తదితర అంశాలపై మున్సిపల్ కౌన్సిల్, మున్సిపాలిటీ, పట్టణ, గ్రామ పంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్షులను చైర్మన్ అభ్యర్థించారు. 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యులు మహ్మద్ సనావుల్లా, పాండే, యాలక్కి గౌడ, కెంపేగౌడ, సుప్రసన్న, కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, విజయనగర డిప్యూటీ కమిషనర్ దివాకర్, జడ్పీ సీఈఓ మహ్మద్ హారీస్, బళ్లారి మహానగర పాలికె మేయర్ ముల్లంగి నందీశ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నూతన వంతెన అవసరం: మంత్రి జార్కిహోళి

కంప్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కంప్లి కోటె వద్ద తుంగభద్ర నదిపై నూతన వంతెన అవసరమని పీడబ్ల్యూడీ మంత్రి సతీష్ జార్కిహోళి అన్నారు. సోమవారం కంప్లి కోటె వద్ద పాత వంతెనను మంత్రి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే విధానసభ సమావేశంలో నూతన వంతెన ఏర్పాటు విషయంపై ముఖ్యమంత్రితో చర్చించి మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. వర్షాకాలంలో నదికి ఎక్కువ నీరు పోతుండటంతో వంతెన మునిగిపోయి గంగావతి, కంప్లి వైపు ప్రజలు వెళ్లలేని పరిస్థితి నెలకొందనే విషయం మా దృష్టికి వచ్చిందన్నారు. అందుకని పీడబ్ల్యూడీ అధికారులతో ఇప్పుడున్న వంతెనలను పరిశీలించేందుకు వచ్చానన్నారు. కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి సాధ్యమన్నారు. అలాగే తమ ముఖ్యమంత్రులు పేద ప్రజలకు ఎన్నో పథకాలు అందించారు. ఈ పథకాల వల్ల వీధి కుటుంబాల వారు సుఖజీవనం సాగిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే గణేష్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతూ ఆదర్శంగా నిలిచారన్నారు. విధానసభలో జరిగే సమావేశంలో నియోజకవర్గంలో సమస్యలు చర్చించి వాటి పనులు అమలయ్యేలా కృషి చేస్తున్నారన్నారు. అలా చేపట్టినప్పుడే నిజమైన నాయకుడు అవుతారని అన్నారు. అనంతరం మంత్రులకు నూతన వంతెన ఏర్పాటుచేయాలని వివిధ



పాత వంతెనను పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, అధికారులు

సంఘాలు వినతిపత్రాలు అందించారు. ఎమ్మెల్యే గణేష్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాసరావు, చెన్న బసవరాజు, పురసభ అధ్యక్షులు పట్వా ప్రసాద్, శేకన్న, చెన్నపట్నం మల్లికార్జున, సుశీలమ్మ, స్థాయి సమితి అధ్యక్షులు ఉస్మాన్, సుధీర్, హనుమంతు, చాంద్‌బాషా, లడ్డు వన్నూర్‌వలీ, షణ్ముఖప్ప, పీడబ్ల్యూడీ అధికారులు శరణప్ప, ముక్తార్, హేమరాజ్, గవియప్ప, ఆనంద్, కంప్లి, కురుగోడ తాలుకాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీశైలం ఆలయ అభివృద్ధికి విరాళం



సిద్దరామస్వామి ఆశీర్వాదం పొందుతున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, జూన్16(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మల్లికార్జునస్వామి ఆలయంలో యాత్రికుల నివాసభవనం ఏర్పాటుకు ఎమ్మెల్యే బీఎం నాగరాజు రూ.8.10 లక్షలు విరాళంగా అందజేశారు. ఆదివారం ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా శ్రీశైల మల్లికార్జునస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆయన ఆశీర్వాదాలు పొందారు. అనంతరం శ్రీశైలం జగద్గురువులు సిద్దరామస్వామి ఆశీర్వాదాలు పొందారు. ఆలయ కమిటీ సభ్యులకు ఆయన విరాళాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఏపీఎంసీ మాజీ అధ్యక్షులు రామస్వామి సౌకారు, తాలుకా అధ్యక్షుడు కరిబసప్ప, నగరసభ కౌన్సిలర్ గణేష్, భూన్యాయమండలి సభ్యులు పవన్‌కుమార్, దేశాయ్, కోటిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలను టార్గెట్ చేసిన ఈడీ

- కాంగ్రెస్ ఎస్సీ విభాగ అధ్యక్షుడు వీరాంజనేయులు

కంప్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఈడీ అధికారుల ద్వారా ఎస్సీ, ఎస్టీ కులాల ఎమ్మెల్యేలను లక్ష్యంగా చేసుకుని ఇళ్లలో సోదాలు చేయిస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ విభాగ అధ్యక్షుడు వీరాంజనేయులు ఆరోపించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ నాయకుడు ఎమ్మెల్యే గణేష్ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని, ఇది చూసి ఓర్వలేకనే ఆయనపై ఈడీ దాడులు చేయించిందన్నారు. జిల్లాలో ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ ఎమ్మెల్యేలను లక్ష్యంగా చేసుకుందన్నారు. ఎవరెన్ని కుతంత్రాలు చేసినా ప్రయోజనం ఏమీ ఉండదన్నారు. తమ నాయకుడికి అభివృద్ధి పనులే శ్రీరామరక్ష అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఐటీ, ఈడీ, సీబీఐ సంస్థలను దుర్వినియోగం చేస్తోందన్నారు. కర్ణాటకలో అధికారం లేని కారణంగా బీజేపీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఎంపీలపై దాడి చేయిస్తోందన్నారు. ఈడీ దాడి సమయంలో ఎమ్మెల్యేలు తగిన సమాధానం ఇచ్చారన్నారు. ఎమ్మెల్యేలు ఇలాంటి దాడులకు భయపడరన్నారు.

కులగణన సర్వే 22 వరకు పొడిగింపు

విజయనగరం (హోస్పేట), జూన్ 16(ఆంధ్ర జ్యోతి): షెడ్యూల్డ్ కులాల సమగ్ర సర్వేలో ఇంకా పాల్గొనని కుటుంబాలకు 22వ తేదీ వరకు గడువును పొడిగిస్తూ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్లు సాంఘిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ షకీ అహ్మద్ తెలిపారు. సర్వే కర్ణాటక వన్, బెంగళూరు వన్, గ్రామ వన్ కేంద్రాలు, బాపూజీ సేవా కేంద్రాలు తదితర పౌర సేవా కేంద్రాలలో కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. అదనంగా లింక్ ద్వారా ఆన్‌లైన్ స్వీయ ప్రకటన ప్రక్రియను 22 వరకు పొడిగించారన్నారు. సర్వే సంబంధిత ప్రదేశాలలో అందుబాటులో వుంటుందని తెలిపారు.



గాంధీ సర్కిల్‌లో రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

సీఎం, డిప్యూటీ సీఎం రాజీనామా చేయాలి

సిరుగుప్ప, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సీఎం, డిప్యూటీ సీఎంలు రాజీనామా చేయాలని బీజేపీ జిల్లా యువమోర్చా అధ్యక్షుడు ఎంఎస్ సిద్దప్ప డిమాండ్ చేశారు. సోమవారం సిరుగుప్ప పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో బెంగళూరులో జరిగిన సంఘటనను వ్యతిరేకిస్తూ తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. గాంధీజీ సర్కిల్‌లో రాస్తారోకో చేశారు. ఆయన మాట్లాడుతూ.. 11 మంది దుర్మరణానికి కారకులైన సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలన్నారు. ప్రభుత్వం సరైన భద్రత కల్పించకపోవడంతోనే ఇంతమంది మృతిచెందారని ఆరోపించారు. బీజేపీ తాలుకా అధ్యక్షుడు మల్లికార్జున స్వామి, సీనియర్ నాయకులు దరప్ప నాయక, ప్రధాన కార్యదర్శి బెళగల్ బసవరాజు, మల్లికార్జున, ఈరణ్ణ గౌడ, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీట్‌లో సర్ ఎంవీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



అభిషేక్



అనన్య



విఠల్ రెడ్డి



రక్ష



సుజన్



జీవన్



బాలాజీ తేజస్



రాహుల్ మురాద్



ఆదితి వీరేశ్ అంగడి



దీక్ష



నిహార్



నెలవిగి యోగేశ్వర్

బళారి సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థ అయిన సర్ ఎంవీ కళాశాల విద్యార్థులు నీట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచారు. ఈసారి కూడా మంచి మార్కులు సాధించడం ద్వారా సంస్థ ప్రతిష్ఠను పెంచారు. అభిషేక్ 720మార్కులకు గాను 622మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 275వ ర్యాంకు సాధించి దావణగెరె జిల్లాలో మెదటి స్థానంలో నిలిచాడు. విద్యార్థుల ర్యాంకులు అనన్య 497, విఠల్ రెడ్డి 595, రక్ష 590, సుజన్ 589, జీవన్ 588, బాలాజీ తేజస్ 587, రాహుల్ మురాద్ 585, ఆదితి వీరేశ్ అంగడి 584, దీక్ష 584, నిహార్ 582, నెలవిగి యోగేశ్వర్ 582 మార్కులు సాధించారు. సంస్థ 480కి పైగా ఉచిత మెడికల్ సీట్లను ఆశిస్తోంది. కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, లెక్చరర్లు, సిబ్బంది విద్యార్థుల విజయాల పట్ల ఆనందాన్ని వ్యక్తంచేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం సన్మానించింది.

పొలంలో మొసలి ప్రత్యక్షం..!



మొసలిని బంధించిన అటవీ శాఖ అధికారులు

రాయచూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దేవదుర్గ తాలూకా జాలహళ్లి సమీపంలోని పొలంలో ఆదివారం రాత్రి మొసలి ప్రత్యేక్షమైంది. గమనించిన స్థానికులు పోలీసులకు, అటజీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సోమవారం ఉదయం అక్కడికి చేరుకున్న అధికారులు మొసలిని బంధించి దూర ప్రాంతంలోని నదిలోకి వదిలారు. నారాయణపూర్ కుడి కాలువ నిర్మాణం సందర్భంగా జాలహళ్లి సమీపంలోని ఒక పొలంలో పెద్ద ఎత్తున తవ్వకాలు జరపడంతో ఆ తవ్వకాల్లో నిలిచి ఉన్న నీటిలో కొంత కాలంగా మొసలి నివాసం ఉన్నట్లు స్థానికులు అధికారులకు వివరించారు.

అధికారుల ఆలోచనా విధానం మారాలి

- ఎంపీ కుమార్ నాయక్

రాయచూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రూపొందించిన పథకాల వల్లే మార్పు సాధ్యం కాదని, వాటిని సమర్థవంతంగా వినియోగించడం ద్వారానే ప్రగతి సాధ్యమని ఎంపీ కుమార్ నాయక్ అన్నారు. సోమవారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి 'దిశా' సభకు అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రూపొందించే పథకాలను సమర్థవంతంగా ప్రజలకు చేరవేయడం అధికారుల బాధ్యత అన్నారు. జిల్లాలో అన్ని రకాల అభివృద్ధి సాగుతున్నా ఒక్క వ్యవసాయ తోటల పెంపకంలోనే వెనకబడి ఉండడాన్ని ఎంపీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. రైతులకు అవసరమైన పథకాలను అధికారులు సిద్ధం చేసి ప్రభుత్వం ముందుంచాలని, ప్రభుత్వ పథకాల వల్లే అభివృద్ధి సాధ్యమన్న విషయాన్ని పక్కన పెట్టాలన్నారు. జిల్లాలో రోడ్ల అభివృద్ధి గణనీయంగా సాగుతుందని, ఈ వనరులను అధికారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జానపదం.. ఓ సాహిత్య కళ: మేయర్

బళ్లారి రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జానపదం అనేది సాహిత్య కళ అని మేయర్ నందీష్ అన్నారు. నగరంలోని కోట ప్రాంత సమీపంలో జానపద కార్యక్రమాన్ని మేయర్‌తో కలిసి ముండ్రిగి నాగరాజు, టీహెచ్‌ఎం బసవరాజు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ఉత్సాహంతో పాటు జానపద పాటలు, తోలు బొమ్మలాట తదితర కార్యక్రమాలు నిర్వహించేవారన్నారు. ఈ కార్యక్రమాలకు ప్రజలు పెద్దఎత్తున వెళ్లి తిలకించేవారన్నారు. జానపద కార్యక్రమాలతో గ్రామీణ ప్రాంతాల్లో కళారంగాన్ని ఎంతో ప్రోత్సహించే అన్నారు. ఆర్ శివశంకర్, గోవర్దన్, తిప్పేస్వామి, ఉలిగప్ప, మహేశ్వరి, జగన్నాథ్, హెచ్ రమేష్ ఈ కార్యక్రమంలో పాల్గొని జానపద పాటల కీర్తిని వివరించారు.



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్ నందీష్

హోసూరు జోన్

పదో తరగతి టాపర్లకు సత్కారం



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

హోసూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): 20240-25 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో జిల్లాస్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. పాఠశాల స్థాయిలో మూడు స్థానాలు సాధించిన విద్యార్థులను హోసూరు ఆర్‌వీ ప్రభుత్వ బాయ్స్ హయ్యర్ సెకండరీ పాఠశాలలో ఏర్పాటైన కార్యక్రమంలో ఆత్మీయంగా సన్మానించారు. ప్రథమస్థానంలో శ్రీధరన్, రెండోస్థానంలో కిశోర్, మూడోస్థానంలో మహ్మద్‌సాత్ నిలిచారు. మేయర్ సత్య స్వయంగా విద్యార్థులను శాలువాతో సత్కరించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలలో నిలిచినవారికి వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, రూ2వేలు నగదు అందచేసి అభినందించారు. పాఠశాల నిర్వహణా కమిటీ ఇన్‌చార్జులు శ్యామల, శరవణన్, పెరుమాళ్ పిళ్లై, ప్రభాకర్, సభ్యులు, పేరెంట్స్-టీచర్ అసోసియేషన్ అధ్యక్షుడు సెందిల్‌కుమార్‌తోపాటు కౌన్సిలర్ వెంకటేశ్, పాఠశాల పూర్వ విద్యార్థులు కుమార్, పతిలారెన్స్, పాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హోసూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా పరిధిలోని బాగలూరు స్టేషన్, సేవకనహళ్ళి సబ్‌స్టేషన్, నారికపురం సబ్‌స్టేషన్‌లలో విద్యుత్ పరికరాల నిర్వహణ పనుల రీత్యా ఈనెల 17న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బాగలూరు సబ్‌స్టేషన్ పరిధిలోని బాగలూరు, జీమంగళం, ఉలియాలం, నల్లూరు, పెలత్తూరు, తిన్నపల్లి, సూదాపురం, అలసపల్లి, పి ముత్తుకనపల్లి, దేవీరాపల్లి, సత్యమంగళం, తుమ్మనహళ్ళి, పదుదేపల్లి, పలవనపల్లి, ముత్తాలి, ముత్తుకూరు, వనమంగళం, కొత్తపల్లి, సేవకనపల్లి, చిదిరుకానపల్లి గ్రామాల్లో విద్యుత్‌కోత ఉంటుందన్నారు. నారికనపురం సబ్‌స్టేషన్ పరిధిలోని నారికనపురం పెర్గిగై అత్తిముగం, చెట్టిపల్లి, నరసపల్లి, పన్నపల్లి, చిగానపల్లి, నేరికంకూల్, కేజలంతోటి, తన్నీర్కుండలపల్లి, ఎలువపల్లి, కేఎన్ తొట్టి, పీఎస్ తిమ్మసంద్రం-1 గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. సేవకనపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో కాకలూరు, నల్లూరు, కొత్తపల్లి, సొక్కనాథపురం, చిట్కరణపల్లి, చుట్టుపక్కల ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కానుందని ప్రకటనలో తెలిపారు.

ఆలయ జీర్ణోద్ధరణకు శ్రీకారం

హోసూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బాగలూరులోని జైభీమనగర్ ప్రాంతంలో పురాతనమైన ఐదుదేవతలు కొలువైన ఆలయ జీర్ణోద్ధరణకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కప్పలమ్మన్, మరియమ్మన్, బిలకమ్మ, మదురమ్మన్, కావేరమ్మ అనే



గ్రామదేవతల ఊరేగింపు



కలశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

ఐదుగురు దేవతలు ఇక్కడ కొలువై ఉన్నారు. ఆలయానికి సుమారు 300 సంవత్సరాల చరిత్ర ఉంది. ఐదుగురు గ్రామదేవతల విగ్రహాలతో ఊరేగింపు, ప్రత్యేక హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా 250మందికిపైగా మహిళలు కళశాలతో ఊరేగారు. అనంతరం కళశాలలోని తీర్థాన్ని అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. విశేషపూజల అనంతరం ఆలయాన్ని అభివృద్ధి చేసేపనులు ప్రారంభించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.